

APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక




సంపుటి : 01 | సంచిక : 70 | 01 - 11 - 2026 | ఆదివారం | పేజీలు : 10 | వెల : 09 /-

Published In Srikakulam , Vijayanagaram , Vishakapatnam, Araku , Anakapalli , Kakinada , Narasapuram, Amalapuram, Rajamundry, Eluru , Machilipatnam , Vijayawada

ఏపీకి మరో తుపాను గండం

నెల్లూరు-నరసాపురం మధ్య తీరం దాటనున్న తీవ్ర తుపాను!



అమరావతి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వేగంగా బలపడుతోంది. ఇది రేపటికి తుపానుగా, ఆపై తీవ్ర తుపానుగా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకురానుంది. ఈ తుపాను నవంబర్ 3వ తేదీ

దేశాన్ని కాపాడిన
దార్శనికుడు సర్దార్ పటేల్ : నరేంద్ర మోదీ



ఏక్తానగర్ (గుజరాత్) , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశాన్ని ఒక్కటిగా నిలబెట్టడంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆయన లేకపోతే నేటి భారతదేశాన్ని ఊహించుకోవడం కూడా కష్టమేనని పేర్కొన్నారు. విభజన తర్వాత దేశంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో పటేల్ చూపిన దూరదృష్టి వల్లే హిమాలయాల నుంచి హిందూ

ఇండియా కూటమి మాక్ పార్లమెంట్
సీఈసీపై ఆరు ప్రధాన అభియోగాలు ఇవే



న్యూఢిల్లీ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఆరు తీవ్ర ఆరోపణలు చేసింది. ఎన్నికల కమిషన్ పాత్ర, దాని స్వతంత్రత, ఓటర్ల హక్కుల పరిరక్షణ, సర్‌పై ఆరోపణలు గుప్పించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈరోజు (శనివారం) ఇండియా కూటమి నేతలు మాక్ పార్లమెంట్




అమెరికా ఎన్నికలపై
ట్రంప్ ఉక్కుపాదం!

అమెరికా , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : అమెరికాలో మధ్యంతర ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అధికార రిపబ్లికన్ పార్టీ, ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ మధ్య పోరు కేవలం ప్రచార సభలు, విధానాలకే పరిమితం కావడం లేదు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాలు, బ్యాలెట్ పత్రాలు, ఓట్ల లెక్కింపు, ఫలితాల ధ్రువీకరణ వంటి అంశాలు కూడా రాజకీయ వివాదాల కేంద్రంగా మారుతున్నాయి. ముఖ్యంగా అలాస్కా రాష్ట్రంలోని సెనేట్ ఎన్నిక ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒకే పేరుతో ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉండటం, ఓట్లు చీల్చేందుకు ఉద్దేశపూర్వకంగా మరో అభ్యర్థిని పోటీకి దించారన్న ఆరోపణలు, దీనిపై ఫెడరల్ దర్యాప్తు.. వెరసి ఈ ఎన్నిక అమెరికా రాజకీయాల్లో కీలక మలుపుగా

53 రోజుల నిర్బంధం
మీకోసం చివరి వరకు నిలబడతా : సీఎం

అమరావతి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : 'నాడు 53 రోజుల అక్రమ నిర్బంధంలో కోట్లాది హృదయాల స్పందన నా జీవితాంతం మర్చిపోలేను. సరిగ్గా మూడేళ్ల క్రితం ఇదే రోజు.. 53 రోజుల అక్రమ నిర్బంధం తర్వాత రాజమండ్రి జైలు నుంచి బయటకు వచ్చాను. నాడు విధ్వంస పాలనను ప్రశ్నిస్తుంటే సహించలేని పాలకులు ప్రజలను, ప్రతిపక్షాలను అణిచివేసే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా నంద్యాలలో నన్ను అర్ధరాత్రి అన్యాయంగా అరెస్టు చేశారు. అది అక్రమ నిర్బంధమని, కుట్రపూరిత అరెస్టు అని అందరికీ తెలిసింది. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆ 53 రోజులూ నా జీవితంలో అత్యంత కఠినమైనవి. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఇదే రోజున మళ్లీ ప్రజల్లోకి వచ్చాను. నేను జైల్లో ఉన్న సమయంలో నాకు అండగా నిలిచిన కోట్లాది తెలుగు ప్రజల మద్దతును నా జీవితంలో మర్చిపోలేను. నిర్బంధంతో నన్ను ఒంటరిని చేయాలనుకున్న కుట్రలు.. యావత్ తెలుగుజాతి తిరుగుబాటుతో బద్దలయ్యాయి. గ్రాటిట్యూడ్ పేరుతో మద్దతుగా నిలిచిన వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

తెలుగు జాతి చూపిన చొరవ నన్ను నిలబెట్టింది..



'నియంతల అణిచివేతను ధిక్కరించి తెలుగు జాతి చూపిన చొరవ నన్ను నిలబెట్టింది. మంచి పాలనా విధానాలతో ప్రజలకు మంచి చేస్తే ఎలా గుర్తు పెట్టుకుంటారో, ఎలా మద్దతుగా నిలుస్తారో ప్రజాస్పందన నిరూపించింది. ముఖ్యంగా ఎంత నిర్భందం ఉన్నా గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన సీబీఎన్ గ్రాటిట్యూడ్ కార్యక్రమంలో వేలాదిగా తరలివచ్చిన యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ నా కోసం నినదించిన ఘటన నాకు జీవితాంతం గుర్తుండిపోతుంది. నేను తెచ్చిన సంస్కరణలు, కల్పించిన అవకాశాలతో మంచి ఉద్యోగాలు పొందిన వారు గ్రాటిట్యూడ్ పేరుతో స్వచ్ఛందంగా రోడ్డెక్కడం ఎంతో గొప్ప విషయం. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచ వ్యాప్తంగా 60కు పైగా దేశాల్లో తెలుగువారు, ప్రజాస్వామ్యవాదులు బయటకు వచ్చి స్వచ్ఛందంగా సంఘీభావం ప్రకటించారు. రోడ్డెక్కి నాటి పాలకుల కుట్రలపై నిరసనలు తెలిపారు. ప్రభుత్వ దుశ్చర్యను ఖండించారు. పల్లెల్లో సామాన్య మహిళల నుంచి ప్రపంచస్థాయి కార్పొరేట్ కంపెనీల సీఈవోల వరకు... రైతుల నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణుల వరకు.. విద్యార్థుల నుంచి ప్రవాసాంధ్రుల వరకు.. సమాజంలోని ప్రతి వర్గం నుంచి వెల్లువెత్తిన మద్దతు అపూర్వం. రాజకీయాలకు ఎప్పుడూ దూరంగా ఉండే నా సతీమణి, నా కుటుంబ సభ్యులు సైతం 'నిజం గెలవాలి' అని మీ వద్దకు వస్తే.. వారితో కలిసి అడుగేసి నిజాన్ని గెలిపించారు. ధర్మాన్ని నిలబెట్టారు' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

మీ ప్రేమను, అభిమానాన్ని నా జీవితాంతం నిలబెట్టుకుంటాను..

'నాకు మద్దతు పలికిన ప్రతి పౌరుడికి, కార్యకర్తకు, అభిమానికి, ప్రజాస్వామ్యవాదికి, ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం తెలిపిన ప్రతి

10 లో



ఏపీ స్థానిక ఎన్నికలకు
సర్వం సిద్ధం

11,378 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు : ఎస్ఈసీ

విజయవాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో రేపు (ఆదివారం) జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధమైందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. తొలిదశలో 100 పట్టణ స్థానిక సంస్థలకు (13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంస్థలు/నగర పంచాయతీలు) ఎన్నికలు జరుగనున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 మున్సిపల్ చైర్మన్ పదవులు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా, పారదర్శక వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి, శాంతి భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం)

విద్యుత్ పునరుద్ధరణకు సాయం చేయండి



అమరావతి, అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : 'అర్నాబ్' తుపాను ధాటికి కుదేలైన ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయానికి తోడు, తాజాగా తమిళనాడు సహకారాన్ని కూడా ఏపీ ప్రభుత్వం కోరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి సి.టి.ఆర్. నిర్మల్ కుమార్‌తో ఫోన్లో మాట్లాడారు. తుపాను కారణంగా రాష్ట్రంలో, ప్రధానంగా విద్యుత్ రంగానికి సంభవించిన అపార నష్టాన్ని గొట్టిపాటి రవికుమార్ ఈ సందర్భంగా తమిళనాడు మంత్రికి వివరించారు. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు అదనపు సిబ్బంది అవసరముందని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో తగినంత మంది విద్యుత్ సిబ్బందితో పాటు అవసరమైన పరికరాలను పంపి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రి గొట్టిపాటి విజ్ఞప్తికి తమిళనాడు మంత్రి నిర్మల్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సిబ్బందిని, సామగ్రిని పంపేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. కాగా, విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే తెలంగాణ నుంచి సహాయం పొందుతున్న విషయం విదితమే. తెలంగాణ సరిహద్దు జిల్లాలకు చెందిన విద్యుత్ సిబ్బంది ప్రస్తుతం ఏపీలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.



విద్యార్థినిపై దాడి అమానుషం
నిందితుడిని వదలొద్దు : పవన్

అమరావతి, అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. తరగతి గదిలోకి చొరబడి ఓ ఉన్మాది విద్యార్థినిపై దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ఇలాంటి అమానుష ఘటనలకు సమాజంలో చోటు లేదని స్పష్టం చేశారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే పవన్ కల్యాణ్..

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది : జగన్

అమరావతి, అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో, తరగతి గదిలోనే ఒక విద్యార్థినిపై రంపంతో జరిగిన కిరాతక దాడి.. టీడీపీ కూటమి పాలనలో శాంతి భద్రతలు ఎంతగా విఫలమయ్యాయో స్పష్టం చేస్తోంది. ఒక ప్రభుత్వ పాఠశాలలోకి దుండగుడు స్వేచ్ఛగా ఎలా ప్రవేశించి, ఒక బాలికపై ఇంత దారుణంగా దాడి చేయగలిగాడు? విద్యాసంస్థల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని జగన్ పేర్కొన్నారు. బాధితురాలిని కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి, రాజకీయ కక్ష సాధింపులు, 'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా రెచ్చిపోతున్నారని జగన్ ఆరోపించారు. గాయపడిన విద్యార్థినులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలని డిమాండ్ చేశారు.



నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, పారదర్శక విచారణ ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమీక్ష జరపాలని, ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని జగన్ అన్నారు.

ఘటన వివరాలు, ప్రభుత్వ స్పందన

రాప్తాడులోని ఓ పాఠశాలలో శనివారం ఓ దుండగుడు తరగతి గదిలోకి ప్రవేశించి పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో విద్యార్థిని ముఖం, తల, గొంతు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుడి చేయి దాదాపు తెగిపోయినట్లు

APTEL/26/A2902


గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

సంపాదకీయం

ఆధునిక యుగపు ప్రాచీన కథకుడు


రాయడం మొదలుపెట్టిన కొత్తలో నాకో సమస్య ఎదురైంది: ఎలా రాయాలి? అంటే పేపర్ మీద చేత్తో రాయాలా? లేక కంప్యూటర్‌లో టైప్ చెయ్యాలా? ఆలోచనా ప్రవాహాన్ని అక్షరాల్లోకి మార్చి లిపిబద్ధం చేసే ఆ ప్రక్రియకి చేతిరాత సులువా? టైపింగ్ సులువా? -- ఇవన్నీ ఈరోజుకీ, అంటే మూడు నవలలు రాసి ప్రచురించిన తర్వాత కూడా, నాకు అప్పుడప్పుడూ వచ్చే ఆలోచనలు. పేపర్ వాడకం మన దేశంలో మొదలవడానికి ముందు, అందంగా కత్తిరించుకున్న తాటాకుల మీద రాసేవాళ్ళని మనకి తెలుసు. అప్పట్లో కావ్యాలూ, ప్రబంధాలూ కవులు తమ శిష్యులకి చెప్తుంటే, శిష్యులు ఆ వాగ్ధారని అంతే వేగంగా గంటంతో తాటాకుల మీద అక్షరాలుగా రాసేవాళ్ళు. మరి వాటికి కాపీలు తీయాలంటే? కొందరు నెత్తిన తాటాకుల పుస్తకాలు పట్టుకుని ఊర్లు తిరుగుతూ, ఇళ్లలో పాడైన పాత గ్రంథాలు ఏవైనా ఉంటే ప్రతులు రాసి పెడతాం అనేవాళ్ళంట. వాళ్ళని వ్రాయసకాళ్ళు అనేవాళు ఇప్పుడు ఇవన్నీ ఎందుకు చెప్తున్నా అంటే, విశ్వనాథ సత్యనారాయణ గారు తన రచనలన్నీ ఎవరికో నెరేట్ చేస్తుంటే, వాళ్ళు రాసినవేనట. అంటే మన ప్రాచీన కవుల పద్ధతి అన్నమాట. కొంతకాలంగా విశ్వనాథ నవలలు వరసగా చదువుతున్నాను. వందా రెండువందల పేజీల నవలలే కాదు, 'వేయి పడగలు' లాంటి మహా ఉద్గ్రంథాలను మనసులో అక్షరీకరించి, నోటితో చెప్తుంటే ఎవరో రాసిపెట్టడం అనే ఆ ప్రాచీన ప్రక్రియ నేటి '+వఙ్' రచయితగా నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆయన రచనలు చదువుతుంటే ఆయన ఆ తిక్కన, ఎర్రన, పోతన్న, పెద్దన్న పరంపరలోనివారే అనిపించింది. (ఆధునిక యుగపు ప్రాచీన కథకుడు). వర్తమానంలో విశ్వనాథ స్థానం ఏమిటి అన్నదానికి ఉదాహరణ, ఈమధ్య రచయిత్రి అపర్ణ తోట సంపాదకత్వంలో వచ్చిన 'అదే ప్రేమ' అనే క్వియర్ కథా సంకలనంలో మొదటి కథ ఆయన రాసిన 'భావనాసిద్ధి' కావడం. కథ మొదలుపెట్టడానికి ఒక ఎత్తుగడ కావాలి. పాఠకుడిని హుక్ చేసే ఒక ట్రిక్-- ఒక సంఘటన, ఒక వాక్యం, ఒక దృశ్యం, ఇలా ఏదైనా... విశ్వనాథ వారి నవలల్లో ఇప్పటిదాకా నేను చదివిన 'హ హ హు హు', 'మిహిరకులుడు', 'పులిముగ్గు', 'చెలియలికట్ట', 'బాణావతి' నవలల్లో అది క్లియర్‌గా కనిపిస్తుంది. లండన్ ట్రఫాల్గర్ స్క్వేర్‌లో రెక్కలుతెగి పడిన ఓ గంధర్వుడు కావొచ్చు; విద్య నేర్పిన గురువుగారితో తనలోని శాడిజమ్‌ను వివరించే రాకుమారుడు కావొచ్చు; ముందుకాళ్ళు పులివి, వెనకాళ్లు మనిషివి అయిన ఓ విచిత్ర జీవిని అన్వేషించడం కావచ్చు -- అన్నీ అద్భుతమైన ఎత్తుగడలు. (ఆయనకి ఇంగ్లీషు సినిమాలు చూసే అలవాటు ఉందని ఎవరో చెప్పారు. బహుశా, వాటి ప్రభావం కొంత ఉందేమో.) తెలుగు సాహిత్యం మీద ఆసక్తి ఉన్నవాళ్ళు కచ్చితంగా చదవాల్సిన రచన 'హ హ హు హు'. అది చదువున్నప్పుడు అక్కడక్కడా జోనథన్ స్విఫ్ట్ 'గలివర్ ట్రావెల్స్' గుర్తొచ్చింది. అలాగే ఇంగ్లీష్ ఏనిమేషన్ కామెడీ సిరీస్ 'బోజాక్ హార్స్‌మ్యాన్' కూడా గుర్తొచ్చింది. అందులో కూడా గుర్రం తలతో ఉండే ఒక మనిషి క్యారెక్టర్ ఉంటుంది. ఈ నవలలోనూ ఒకచోట ష్ణశీతీంవ ఘ్మిఅ అనే మాట వస్తుంది. కొంతకాలం క్రితం 'హ హ హు హు'ను వెల్చేరు నారాయణరావు ఇంగ్లీషులో అనువాదం చేశారు. దీని తర్వాత నేను చదివిన నవల 'మిహిరకులుడు'. ఇంత భీకర బీభత్స జుగుప్సాకరమైన కథని ఒక ఛాందస సనాతన సంప్రదాయవాది, ఊహించి రాశాడా అనే ఆలోచనతో ఆశ్చర్యపోతూ చదివాను. ఇప్పుడు మనం సినిమాల్లో ట్రెండ్ లాగా చూస్తున్న స్త్రశీతీఎ ఖ్షశీఅశీఅ ఎత్ఖీఘ్ఘి లాంటి కథని ఆయన ఆ కాలంలోనే ఊహించి రాయడం, చదువుతూ ఆయన్ను నిందాస్తుతి చేస్తూనే ఉన్నాను. మధ్యమధ్య కొన్ని వాక్యాలు చాలా నచ్చాయి. ఉదాహరణకు, "మానవుని యొక్క మనస్సు పుండువంటిది. పుండు మానినట్లుండును. లోన పచ్చిగానే యుండును. నిముసములో మరల పుండగును. లేదా లోన సలపరింత యుండును. అందుచేత క్రొత్తక్రూరకర్మ కలిగినపుడు వ్యాధి తిరుగ బెట్టినట్లుండును." విశ్వనాథ నేపాల రాజవంశ నవలలు, కాశ్మీర రాజవంశ నవలలు పేరుతో కొన్ని వరస నవలలు రాసారు. నేను చదివిన తర్వాతి నవల 'పులిమ్రుగ్గు' మగధ రాజవంశ నవలల్లోనిది. కానీ వీటికి ఆయన పురాణ వైరి గ్రంథమాల అని పేరు పెట్టారు. ఈ సిరీస్‌లో 12 నవలలు రాసారు. పురాణవైరి గ్రంథమాలలో, ఎనిమిదవ నవల 'పులిమ్రుగ్గు'. ఈ నవల చదివిన తర్వాత నాకు అనిపించింది ఏంటంటే వీటిని చారిత్రక నవలలుగా అస్సలు పరిగణించకూడదు. చారిత్రక వ్యక్తుల పేర్లు పెట్టి తనకి నచ్చిన కథ రాసుకున్నారాయన. అచ్చంగా మధిర సుబ్బన్న దీక్షితులు కాశీమజిలీ కథల్లాగే. వాటిని ఎలా చదువుతామో, వీటిని కూడా అలాగే చదవాలి. ఈ కథలో నాకు బాగా నచ్చింది. ఆయన ఊహాశక్తి. అలాగే మనిషిలో ఉండే అనేక వికారాలు, విపరీతాలు, వాసనలు ఆయన పైపైనే అయినా ముట్టుకునే ప్రయత్నం చేశారు. మనిషికి ఉండే అనేక వికారాలలో ఖఅఅఘ్మిశ్రీ టవీఅంష్ట ఒకటి. దానిని ఈ నవలలో ప్రధానాంశంగా తీసుకోవడం, కథని ఒక థ్రిల్లర్ లాగా నడిపించడం ఈ నవల ప్రత్యేకత. ఇక ఆయన మార్కు ధర్మాధర్మ వ్యాఖ్యానాలు, విశ్లేషణలు... కొంచెం ఓపిగ్గా భరించాలి. తర్వాత చదివింది 'చెలియలికట్ట'. చలం 'మైదానం' నవలకు కౌంటర్‌గా విశ్వనాథ ఈ నవల రాసారట. స్త్రీ పురుషులు స్వేచ్ఛగా ఏ అడ్డూ అదుపూ లేకుండా జీవితాన్ని మైదానంలా అనుభవించాలి అని చలం రాస్తే, ఎగసిపడే సముద్రానికి కూడా చెలియలికట్ట ఉండాలని లేకపోతే ప్రళయం అయి ముంచెత్తుతుందని పెద్దాయన ఉద్దేశమట. ఈ నవల 1935లో రాసారు. 'మైదానం' అంతకుముందే వచ్చి ఉండాలి. చదువుతుంటే, నాకు 'మైదానం' కన్నా ఈ కథనమే (ఖుతీతీఖ్ఘశీఅ) ఎక్కువ నచ్చింది. మధ్య మధ్య ఆయన కొన్ని వాదనలు చదవడానికి బాగున్నాయి. ఉదాహరణకి: "లోకములో జనులెక్కువ మంది మూఢులు. ఆవేశము కొలది పరుల అనుభవము తమదిగా స్వీకరింతురు. ఆవేశము లేకుండ పూర్వుల అనుభవము సంప్రదాయమను పేర స్వీకరించుట తప్పును, తోడి వాని అనుభవము నావేశముతో క్రొత్తయని స్వీకరించుట ఒప్పునుసగునో!" మరొకటి: "జీవితము వర్తకము వంటిది. ప్రతిదినము లాభనష్టములు చూచుకొనినచో తెలియదు. ఒక్కొక్కప్పుడు ఏ సంవత్సరమున కా సంవత్సరము లెక్కమూచినను లుగస్తాను కనిపించవచ్చును. పదియేండ్ల మొత్తముమీద నెంత పెట్టుబడి పెట్టితిమో, యెంత తిరిగి వచ్చినదో, యెంత సరుకు మిగిలినదో చూచుకొని లాభనష్టములు తేల్చుకొన వలయును." ఈ నవల చదువుతున్నంతసేపూ నాకు శరత్, ఠాగూర్ గుర్తొచ్చారు. కొన్ని పంటికిందరాళ్లలా తగిలిన మాటలు కూడా ఉన్నాయి: రంగ-- మనమిరువురము బ్రాహ్మణులము. మన సంతానము బ్రాహ్మణులగుదురు. రత్నా-- బంగినపల్లి చెట్టున కాయ కాచును. ఆ కాయలో పురుగు పడినచో దానిని సేవింపరు. వర్ణము వర్ణత్వమాత్ర విశిష్టమై యేమి శోభించును? దానియందు స్వచ్ఛత్వము కూడ నుండవలయును. ఆడామగా అన్న గీతలే చెరిగిపోతున్న ఈ కాలంలో గురించి రాసిన ఈ నవలని ఎలా చూడాలి?

తన రచనలు భవిష్యత్ తరాల వాళ్ళు చదవకుండా గ్రాంథికంలో రాసి ఆయనే జాగ్రత్తపడ్డాడు. వాటిని సులభ వ్యవహారికం లోకి మార్చే ప్రయత్నం వారి వారసులు చేస్తారనైతే అనుకోవడం లేదు.'



ఎడిటర్ : దొండ్లవాగు భవ్య

చెంపలు వాచేలా కొట్టి.. గుండెలపై మోకాలితో తొక్కి!



ఏలూరు జిల్లా , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): భార్యాభర్తల మధ్య జరిగిన వివాదం చివరకు హత్యకు దారితీసిన విషాద సంఘటన నూజీవీడు మండలం మీర్జాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జంగారెడ్డిగూడేనికి చెందిన శివరాత్రి దుర్గాప్రసాద్, జ్యోతి దంపతులు బంధువుల ఇంట్లో వివాహ వేడుక కోసం వారం రోజుల క్రితం మీర్జాపురం వచ్చారు. ఈ నెల 28న వివాహం, 29న రిసెప్షన్ పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం కొందరు బంధువులు వెళ్లిపోగా, అనారోగ్యంతో ఉన్న మరొక బంధువును పరామర్శించేందుకు కుటుంబసభ్యులంతా వేరే ఊరు వెళ్లారు. దీంతో ఇంట్లో దుర్గాప్రసాద్, జ్యోతి మాత్రమే ఉన్నారు. ఈ క్రమంలో ఉదయం ఇద్దరి మధ్య ఏ విషయంపై మనస్పర్థలు వచ్చాయో తెలియదు కానీ తీవ్ర గొడవ జరిగింది. ఆవేశానికి గురైన దుర్గాప్రసాద్ భార్య జ్యోతి చెంపలపై బాదుతూ, మోకాలితో గుండెలపై దారుణంగా దాడి చేశాడు. ఆమె కేకలు విని కాపాడేందుకు చుట్టుపక్కల వారు పరుగెత్తుకొచ్చినప్పటికీ అతడు ఆగకుండా కొట్టడంతో జ్యోతి స్పృహతప్పి కిందపడిపోయింది. తీవ్రంగా గాయపడి కదలకుండా ఉన్న ఆమెను వెంటనే సమీపంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. స్థానికులు 112కు సమాచారం అందించడంతో నూజీవీడు రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్, రూరల్ ఎస్సై జి.జ్యోతీబసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజీవీడు ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఐక్యతా స్ఫూర్తిని చాటిన 5కే రన్

- దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత
- జెండా ఊపి పరుగును ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ చక్రవర్తి



రంపచోడవరం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, రాష్ట్రీయ ఏక్తా దివస్, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో శనివారం 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్, ఎస్పీ కె. చక్రవర్తి జెండా ఊపి ఐదు కిలోమీటర్ల పరుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. భారతదేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన విశేష సేవలను వారు స్మరించుకున్నారు. దేశ ప్రజలందరిలో ఐక్యతా భావం, జాతీయ సమైక్యతా స్ఫూర్తిని పెంపొందించడమే రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, జూనియర్ కళాశాల విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ సమైక్యతను చాటుతూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా సాగిన ఈ పరుగుతో రంపచోడవరం వీధులు మార్మోగాయి.



ఏలూరులో పోలీసుల నిర్లక్ష్యం..
రెండు రోజులుగా రోడ్డుపక్కనే మృతదేహం!

ఏలూరు జిల్లా , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): జిల్లాలో పోలీసుల నిర్లక్ష్యం చర్చనీయాంశమైంది. రెండు రోజులుగా రోడ్డు పక్కనే పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించక పోవడమేమిటని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే..స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల అక్టోబర్ 29వ తేదీన ఏలూరు జిల్లాలోని ఆగిరిపల్లి మండలంలో ఓ ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని ఎస్ఏ పేట వద్ద అర్ధరాత్రి.. ప్రమాదవశాత్తు ఓ బీర్ లోడ్ లారీ బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. రోడ్డుపై అడ్డంగా ఉన్న లారీని తొలగించడంలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో లారీ క్యాబిన్‌లో ఇరుక్కొని ఉన్న ఓ వ్యక్తి మృతదేహం కనిపించగా.. పక్కనే ఓ ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. కాగా.. మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పరిశీలించిన వైద్యులు.. ఆ వ్యక్తి లారీ ప్రమాదం వల్ల మృతి చెందలేదని.. రెండు రోజుల క్రితమే మరణించి ఉంటాడని ధ్రువీకరించారు. దీంతో కంగుతిన్న పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టగా.. మృతుడిని శోభనాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా రోడ్డు పక్కనే పడి ఉన్న మృత దేహాన్ని గుర్తించకపోవడం.. పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమంటూ తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి.

తుపాను బాధితులకు ఎస్‌బీఐ అండ

- ఎస్‌బీఐ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కు అందజేసిన ఎస్‌బీఐ ఎండీ అమర రామ్మోహన్ రావు



అమరావతి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టాల నేపథ్యంలో బాధితులను ఆదుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలకు మద్దతుగా ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 5.01 కోట్ల విరాళంగా అందించింది. ఈ మేరకు అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎస్‌బీఐ ప్రతినిధుల బృందం కలిసింది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అమర రామ్మోహన్ రావు ముఖ్యమంత్రికి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. తుపాను బాధితులను ఆదుకునేందుకు ఎస్‌బీఐ అందించిన ఆర్థిక సహాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. విపత్తు సమయంలో అందించిన ఈ విరాళం రాష్ట్ర ప్రభుత్వ సహాయక చర్యలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడంలో ఇటువంటి సంస్థల సహకారం ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల్ కుమార్, జనరల్ మేనేజర్ కుందన్ జ్యోతి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ షేక్ షమీన్ భాను తదితరులు పాల్గొన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రజలకు అండగా నిలిచేందుకు ఎస్‌బీఐ అందించిన విరాళం రాష్ట్ర ప్రభుత్వ సహాయక చర్యలకు తోడ్పాటుగా నిలవనుంది.



గిరి ప్రదక్షిణతో మార్మోగిన పారిజాతగిరి

- పారిజాత వెంకన్నకు వేకువజామునే విశేష పూజలు
- గిరి ప్రదక్షిణకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- భక్తులకు ఉచిత దర్శనం, ప్రసాదం, అన్నదానం ఏర్పాటు



జంగారెడ్డిగూడెం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన శనివారం కావడంతో తెల్లవారుజామున నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థ ప్రసాద గోష్టి, బాలభోగ నివేదన తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయ గార్డెన్ మార్గంలో భూ వరాహస్వామి దర్శనం అనంతరం భక్తులు కంకణధారణ చేసి ఏడు కొండల గిరి ప్రదక్షిణ చేపట్టారు. అయ్యప్ప స్వాములు, గోవింద స్వాములు, భవానీ భక్తులతో పాటు వేలాది మంది భక్తులు కాలినడకన గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అల్లూరి రామకృష్ణ, ధర్మకర్తలు, ఆలయ కార్యనిర్వహణాధికారి మాణికల రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనం, ఉచిత ప్రసాదం, ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెంకు చెందిన మారుబోయిన రామదాసు, కేతిరెడ్డి ప్రసాద్ రెడ్డి, చిన్నపోతుల సూర్యప్రకాశరావు అన్నదాన కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు. వీరిని ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలతో పాటు వేద ఆశీర్వచనాలతో సత్కరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అల్లూరి రామకృష్ణ, అన్నప్రగడ వీర రాఘవరావు, కొప్పుల నాగ సురేంద్ర, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అబ్బిన దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు. శనివారం ఆలయానికి పూజా టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, విరాళాలు, అన్నదాన విరాళాల ద్వారా మొత్తం రూ.1,69,900 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మాణికల రాంబాబు వెల్లడించారు.

మరో తుఫాను ముప్పు

- వాతావరణ పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- నవంబర్ 2, 3, 4 తేదీల్లో భారీ వర్షాలకు అవకాశం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు



అమరావతి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాను విధ్వంసం నుంచి రాష్ట్రం ఇంకా కోలుకుంటున్న తరుణంలో మరో వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అప్రమత్తమయ్యారు. తుఫాను అనంతరం కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు, తాజా వాతావరణ పరిస్థితులపై సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రం లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది రేపటికి తుఫానుగా బలపడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్రలో గుంటూరు నుంచి దిగువ ప్రాంతాల వరకు, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. నవంబర్ 2, 3, 4 తేదీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ల సహాయంతో తుఫాను కదలికలను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, విపత్తు ప్రభావాన్ని తగ్గించేలా ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌తో పాటు విద్యుత్, విపత్తుల నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు, వివిధ టెలికాం ఆపరేటర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఫైర్ అధికారి

- రూ.65 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఫైర్ అధికారి!
- ఐదు బాణాసంచా దుకాణాలకు ఫైర్ ఎన్ఓసీల కోసం రూ.75 వేలు డిమాండ్
- రాజమండ్రిలోని ఫైర్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల దాడి



తూర్పుగోదావరి జిల్లా , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అవినీతి నిరోధక శాఖ వలలో మరో ప్రభుత్వ అధికారి చిక్కారు. ఐదు బాణాసంచా దుకాణాలకు ఫైర్ ఎన్ఓసీలు జారీ చేయడంతో పాటు తనిఖీల నిర్వహణ కోసం లంచం తీసుకుంటూ తూర్పుగోదావరి జిల్లా సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు బాణాసంచా దుకాణాలకు ఫైర్ ఎన్ఓసీలు జారీ చేయడంతో పాటు తనిఖీల కోసం సదరు అధికారి మొత్తం రూ.75 వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.65 వేలు తీసుకునేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రాజమండ్రిలోని కోటిపల్లి బస్‌స్టాండ్ సమీపంలోని ఫైర్ కార్యాలయంలో లంచం తీసుకుంటున్న సమయంలో అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తదుపరి విచారణ చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.



లింగారెడ్డిపాలెంలో ఎన్నికల సందడి

- లింగారెడ్డిపాలెంలో కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచార సందడి
- గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు



కోడూరు , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): కోడూరు మండలం లింగారెడ్డిపాలెం గ్రామంలో కూటమి పార్టీల అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి బొలిశెట్టి అరుణశ్రీ, జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి దాసరి ఏసు కుమారి గ్రామంలో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. తమ అభ్యర్థిత్వాన్ని పరిచయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలు, గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి తరఫున ఎన్నికల బరిలో నిలిచినట్లు అభ్యర్థులు వివరించారు. ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభ్యర్థుల వెంట గ్రామంలో పర్యటిస్తూ ప్రచారంలో భాగస్వాములయ్యారు. జడ్పీటీసీ అభ్యర్థి బొలిశెట్టి అరుణశ్రీ ఎన్నికల గుర్తు సైకిల్ కాగా, లింగారెడ్డిపాలెం ఎంపీటీసీ అభ్యర్థి దాసరి ఏసు కుమారి ఎన్నికల గుర్తు గాజు గ్లాసు. ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయం కనిపించింది.

కోనసీమలో కేంద్ర బృందం పర్యటన..ఆర్నబ్ తుఫాన్ నష్టంపై ఆరా



కోనసీమ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో జరిగిన పంట, ఆస్తి నష్టం అంచనాలను రూపొందించేందుకు ఏర్పాటు చేసిన కేంద్ర బృందం ఏపీలో పర్యటిస్తోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించిన ఈ బృందం అక్కడి పరిస్థితులను పరిశీలించింది. రావులపాలెం సీఆర్‌సీలో తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టంపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. అరటి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని.. విద్యుత్ నష్టం, రహదారులు, ఆస్తి నష్టాలను వివరించారు.తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని వివిధ రంగాలకు జరిగిన నష్టాన్ని తెలియజేసేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని కేంద్ర బృందం సందర్శిం చింది. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో కొట్టుకుపోయిన, గల్లంతైన మత్స్యకారుల పడవలు, దెబ్బతిన్న వలలకు సంబం ధించిన వివరాలను కేంద్ర బృందం అడిగి తెలుసుకుంది. ఈ బృందంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అడిషనల్ డెరైక్టర్ ప్రశాంత్ అర్మోరికర్, ఆర్థిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ హిమా లయ గార్గ్, డిప్యూటీ డైరెక్టర్ ప్రణయ్ గార్గ్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సీఈఓ ప్రకర్ జైన్, విపత్తు నిర్వహణ రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులు ఉన్నారు.

ఆకివీడు ఎన్నికలకు ఖాకీ బందోబస్తు

- 33 పోలింగ్ కేంద్రాల వద్ద 220 మంది పోలీసులతో భద్రత
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు: డీఎస్పీ రఘువీర్ విష్ణు



ఆకివీడు , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం జరగనున్న పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు భీమవరం డీఎస్పీ రఘువీర్ విష్ణు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి అవసరమైన సూచనలు అందించడంతో పాటు, సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరిస్తున్నట్లు వెల్లడించారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని మొత్తం 33 పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 220 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియో గించుకునేలా భద్రత కల్పిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటారని డీఎస్పీ రఘువీర్ విష్ణు పేర్కొన్నారు.



రాప్తాడులో విద్యార్థినిపై దాడి

అధికారులకు సీఎం కీలక ఆదేశాలు



అనంతపురం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ హైస్కూలులో పదో తరగతి విద్యార్థినిపై ఉన్మాది దాడి ఘటన పట్ల సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల తరగతిలో గాయాలపాలైన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ బాలికకు అందుతున్న చికిత్స గురించి ఆరా తీశారు. ఈ దాడికి పాల్పడిన నిందితుడిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని జిల్లా పోలీసు అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. తి గదిలో విద్యార్థినిపై రంపంతో అత్యంత అనుమానుషంగా దాడి చేయడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు దుర్మార్గాలు చేస్తున్నారు : పేర్ని నాని



అమరావతి, అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): రేపు మున్సిపల్ ఎన్నికలు జరగనున్న వేళ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని అధికార కూటమి దుర్మార్గాలకు పాల్పడుతోందని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. మచిలీపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... తప్పుడు మార్గాల్లో ఏకగ్రీవాలు సాధించి, కూటమి బలంగా ఉందని చూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. చంద్రబాబే అన్నీ గెలిచారని బిల్డప్ ఇచ్చుకోవడం కోసమే ఈ దుర్మార్గాలు చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు" అని పేర్ని నాని మండిపడ్డారు. బీసీ కుల గణన చేపట్టకుండా, ఓట్లు తక్కువగా ఉన్నాయని చూపిస్తూ రిజర్వేషన్లలో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పలు మండలాల్లో దళితులకు ఎంపీపీ సీట్లు రిజర్వ్ చేయలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో పేర్ని నాని వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని వైసీపీ నేతలు అధికార పార్టీపై ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు, వైసీపీ నేతలే హింసను ప్రేరేపిస్తున్నారని టీడీపీ ఎదురుదాడి చేస్తోంది. ఇదిలా ఉండగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రాప్తాడు ఘటన..బాధితురాలి తల్లికి చంద్రబాబు ఫోన్

అమరావతి, అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అనంతపురం జిల్లాలోని రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థిని తల్లితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "మీరు ధైర్యంగా ఉండండి. మీ కుమార్తెను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేద్దాం. ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుంది" అని భరోసా ఇచ్చారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితుడిని తక్షణమే పట్టుకుని చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం, విద్యార్థినికి అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని సూచించారు. ఇదే ఘటనలో గాయపడిన మరో విద్యార్థినికి కూడా అత్యుత్తమ చికిత్స అందించాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు. పాఠశాలలో జరిగిన ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మళ్లీ రాజన్న రాజ్యం

- జగనన్న సంక్షేమ పాలన కోసం ప్రజల ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శలు



జీలుగుమిల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): రాష్ట్రంలో మళ్లీ రాజన్న రాజ్యం, జగనన్న సంక్షేమ పాలన రావాలని ప్రజలు ఆశిస్తున్నారని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాల రాజు అన్నారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మం డలం ములగలంపల్లి గ్రా మంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన స్థానిక సంస్థల ఎన్ని కల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీటీసీ, జ డ్పీటీసీ అభ్యర్థుల విజ యాన్ని కాంక్షిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భ ంగా తెల్లం బాలరాజు మా ట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యా వసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు సుభిక్షంగా లేరని విమర్శించారు. రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల కళ్లలో ఆనందం కంటే కన్నీరే ఎక్కువగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేయలేకపోయారని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో తిరిగి రాజన్న రాజ్యం, జగనన్న సంక్షేమ పాలన రావాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పోలవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎంపీటీసీ స్థానాల గెలుపు కోసం ప్రతి కార్యకర్త ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించే విజయమే భవిష్యత్తు రాజకీయ విజయానికి తొలి అడుగు కావాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ములగలంపల్లిలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సందా ప్రసాద్, జిల్లా నాయకులు బోధ శ్రీనివాస్ రెడ్డి, కొల్లూరి రాంబాబు, జిల్లా సీనియర్ నాయకులు ఘంటసాల గాంధీ, మాజీ వైస్ ఎంపీపీ సోమగాని శ్రీను, మండల నాయకులు కొప్పుల బాలు, మొహమాటం మంగరాజు, సాయి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో కలిసి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు.

అన్నదాతకు అకాల కష్టం

- కోనసీమలో తుఫాన్ నష్టంపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన
- నేలకొరిగిన వరి పంటలు.. నీట మునిగిన పొలాలను పరిశీలించిన అధికారులు
- పరిహారంపై అన్నదాతల ఆశలు



పి.గన్నవరం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాన్ సృష్టించిన బీభత్సంతో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రైతులకు జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం జిల్లాలో పర్యటించింది. జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ నేతృత్వంలో అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ తుఫాన్ ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా అంబాజీపేట మండలం గంగల కుర్రు గ్రామంలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ పొలాలను కేంద్ర బృందం సందర్శించింది. బలమైన ఈదురుగాలుల ధాటికి వందలాది ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. మరోవైపు భారీ వర్షాల కారణంగా పంట పొలాలు నీట మునగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎంతో ఆశతో సాగు చేసిన వరి పంట చేతికందే సమయంలో ప్రకృతి వివత్తు రూపంలో తుఫాన్ విరుచుకుపడటంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట కళ్లముందే నేలకొరిగి, నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర బృందం నీట మునిగిన వరి పొలాలను, నేలకొరిగిన పంటను నేరుగా పరిశీలించింది. తుఫాన్ కారణంగా వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాన్ని, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. కేవలం నివేదికలు, గణాంకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితులను అంచనా వేసే దిశగా కేంద్ర బృందం పర్యటన సాగింది. తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన కోనసీమ రైతులకు కేంద్ర ప్రభుత్వ సహాయం అందుతుందా? పంట నష్టానికి తగిన పరిహారం లభిస్తుందా? అన్న ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.



ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

సత్తెనపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజావేదికలో ముస్లిం మైనారిటీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరా యలు , పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ జానీ సైదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం గతంలో పలు పథకాలను అమలు చేసిందని గుర్తుచేశారు.

రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, విదేశీ విద్య, మసీదుల అభివృద్ధికి నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మైనారిటీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని విమర్శిస్తూ, కూటమి ప్రభుత్వం వారి అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు మైనారిటీ యువత విద్య, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని పేర్కొ న్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనారిటీలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని కోరారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు షేక్ జానీ సైదా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో మైనారిటీలకు సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనారిటీ అభ్యర్థులకు తగిన అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.

గెలుపే బాటలో 110 వైసిపి అభ్యర్థి జోష్ణి



అనకాపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): పట్టణంలోని గవరపాలెం 109 వార్డు నుండి జీవీఎంసీ ఎన్నికల బరిలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉగ్గిన జ్యోత్స్న విజయపథవైపు పయనిస్తున్నారు . చిరు దరహాసంతో గత వారం రోజులుగా విజయం కోసం అహర్నిశలు శ్రమించారు ఆ శ్రమ ఊరికినే పోలేదు. సానుకూల వాతావరణాన్ని కల్పించింది. ప్రజల అభిమానాన్ని కూడగట్టింది. పట్టణ వైసిపి అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు డాక్టర్ జి రామ్మూర్తి వంటి వారు ఆమె విజయానికి విశేష కృషి జరిపారు క్యాడర్ను అప్రమత్తం చేసి నిరంతరం జనంలో ఉండేలా చేసిన కృషి ఫలించింది.గెలిస్తే చేసే అభివృద్ధి వివరించారు గతంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు సతీమణి సునీత కార్పొరేటర్ గా చేసిన అభివృద్ధిని వివరించారు ఎక్కడ రాజీ పడకుండా జోష్ణి తన భర్త అప్పారావుతో కలిసి ప్రజలతో మమేకమై వారి అభిమానాన్ని పొందారు వైసిపి అనకాపల్లి సమన్వయకర్త భరత్ కుమార్ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి జోష్ణ గెలుపుకు తమ వంతు ప్రయత్నం చేశారు.కూటమి నుండి పోటీ చేసిన అభ్యర్థికి ధీటైన పోటీ ఇచ్చి గెలుపుకు బాటలు వేసుకున్నారు 1న ఆదివారం జరిగే ఎన్నికల్లో 110 డివిజన్ నుండి 13500 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు ఏది ఏమైనాప్పటికీ ఎన్నికను జోష్ణ అప్పారావు సవాల్ గా తీసుకొని పని చేశారు ..వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలన... మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఇమేజ్ను సొమ్ము చేసుకున్నారు.కూటమి సవాల్ ను సమర్థవంతంగా ఎదుర్కోవటంలో విజయం సాధించారనక తప్పదు . కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదల ప్రధాన అజెండాగా మారింది.. సామాన్య ప్రజానీకం ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకొని వైసిపి వైపు అనుకూలత చూపుతున్నారు కూటమి పై వ్యతిరేకత ఉన్నవారు పూర్తి సహకారం అందించారు ఏది ఏమైనప్పటికీ విజయం సాధించే అవకాశం ఉందని చెప్పవచ్చు

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి : కలెక్టర్



అనకాపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): గుర్రప్ప కల్యాణ మండపంలో శనివారం ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల నిర్వహణపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ ఈ కార్యక్రమంలో కార్యక్రమానికి హాజరై ఎన్నికల విధులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ రోజున ప్రతి అధికారి ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, , బ్యాలెట్ బాక్సుల వినియోగం, ఎన్నికల సంబంధిత ఓటు పత్రాల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియను మి నిర్చితముగా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, పి జె ఎస్పీ రాజు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రవీంద్ర ధామ జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ విభాగం సిబ్బంది, ట్రైనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం భూములపై ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయాలి!



విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి పవిత్ర క్షేత్రానికి సంబంధించిన భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించి రద్దు చేయాలని తెలుగుశక్తి అధినేత బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఆలయ భూములు కేవలం ఆస్తులు మాత్రమే కావని, అవి కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి, హిందూ ధర్మ సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ధార్మిక ప్రయోజనాల కోసం ఉద్దేశించిన భూముల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.శనివారం విశాఖపట్నం జిల్లా పెందుర్తి చిన్న ముషిడివాడ లోని విశాఖ శ్రీ శారదా పీఠంలో రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్న అనంతరం బి.వి.రామ్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సింహాచలం క్షేత్ర భూముల వ్యవహారంపై తన అభ్యంతరాలను వ్యక్తం చేశారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసిం హస్వామి వారి క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.. అలాంటి భూముల విషయంలో ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర ఆక్షేపణీయమని పేర్కొన్నారు .రామదేవ్ బాబాకు భూములు కేటాయించినట్లు భావించినప్పటికీ, చివరకు ఒక రిసార్ట్కు భూములు అప్పగించినట్లు ఆరోపణలు వస్తున్నాయని బి.వి.రామ్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల కేటాయింపు వెనుక ఉన్న వాస్తవాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని, వాటి వినియోగంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.సింహాచలం క్షేత్ర అభివృద్ధి, హిందూ ధర్మ పరిరక్షణ విషయంలో స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామీజీ చేసిన కృషి మరువలేనిదని బి.వి.రామ్ అన్నారు. ఇటువంటి ధార్మిక అంశాల్లో ఆయన మార్గదర్శకత్వం ప్రస్తుతం లేకపోవడం లోటుగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : ఎస్పీ



అనకాపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అనకాపల్లి జిల్లా పరిధిలోని జీవీఎంసీ 9 వార్డులు (అనకాపల్లి, పరవాడ, సబ్బవరం), అలాగే నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీలలో రేపు (01.11.2026) జరగనున్న ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ గారు తెలిపారు. శనివారం నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ మైదానంలో ఎన్నికల విధులకు కేటాయించిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి బ్రీఫింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో పోలీసులు పాటించాల్సిన మార్గదర్శకాలు, చేయవలసిన మరియు చేయకూడని పనులపై జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. అనంతరం నర్సీపట్నం, బొడ్డేపల్లిలోని డాన్ బాస్కో డిగ్రీ కాలేజ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) కేంద్రం, కౌంటింగ్ కేంద్రాన్ని నర్సీపట్నం ఆర్డీవో శ్రీ వి.వి.రమణ గారితో కలిసి ఎస్పీ పరిశీలించారు. అక్కడ కల్పించాల్సిన మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్ 163 (గతంలో 144 సెక్షన్) అమల్లో ఉంటాయని, ప్రజలు, రాజకీయ పార్టీల అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కటాయించిన పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షించాలి. ఎటువంటి పక్షపాత వైఖరి లేకుండా, చట్టం ముందు అందరూ సమానులే అనే దృక్పథంతో పూర్తిగా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు

నీట మునిగిన పొలాలను పరిశీలించిన దాడి



అనకాపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ఇటీవల వచ్చిన ఆర్నాబ్ తుఫాను మూలంగా నష్టపోయిన ప్రాంతా లను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు శనివారం సందర్శించారు అనకాపల్లి పట్టణ ప్రాంతంలో 26 సెంటీమీటర్ల వర్షపాతం కురిసిన కారణంగా పంట పొలాలన్నీ పూర్తిగా నీటిలో మునిగి పోయాయి. ఇప్పటివరకు ఉన్నటువంటి కరువు పరిస్థితుల్లో ఈ ప్రాంత రైతాంగం బోరులు, బావులు ద్వారాగా సుమారుగా 1000 ఎకరాల వరకు పంట వేయడం జరిగింది. ఎన్నో ప్రయాసలకు ఓర్చి వరి నాట్లు వేయడం జరిగింది. మిగిలిన 5000 ఎకరాలు ఎలినినో ప్రభావం కారణంగా వర్షాలు కురియక ఏ విధమైనటువంటి పంటలు వేయలేక కరువుతో పూర్తిగా నష్టపోవటంతో వారిని వరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు . అనకాపల్లి మండలాన్ని ప్రభుత్వం వారు కరువు మండలంగా ప్రకటించి ఉన్న ఇప్పటివరకు కరువుతో అల్లాడిపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వం నుండి ఏ విధమైన సహాయం అందలేదని రైతులుఆయన దృష్టికి తీసుకువచ్చారు . ఇన్సూరెన్స్ ఫసల్ బీమా యోజన పై తీశారు ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో ఇబ్బందులు పడి వరి నాట్లు వేసిన వరి పొలాలు కూడా ఈ వారంలో కురిసిన వర్షానికి పూర్తిగా నీటమనిగి కుళ్ళిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ ముంపు నీరు ఒక వారం రోజులు వరకు పోయే పరిస్థితి ఏమాత్రం లేదు. ఆవ ఖండం నుండి దిగువకు వెళ్లే తోటాడ రెగ్యులేటర్ వద్ద తుప్పలు, పడిపోయిన చెట్లు అడ్డంగా ఉండడం వలన నీరు దిగువక పోయే పరిస్థితి లేదని దాన్ని క్లియర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు . ఈ పరిస్థితిలో నీటిపారుదల శాఖ అధికారులకు రెవెన్యూ అధికారులకు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఏ విధమైన సహాయం లభించక రైతులే డబ్బు సమకూర్చుకొని అడ్డంగా ఉన్న తుప్పలను, చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయదారుల సంఘం చైర్మన్, మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్ర రావు తో కార్యదర్శి విల్లూరి రాము, ఉపాధ్యక్షుడు కర్రి మోది నాయుడు, సారిపల్లి లోకేష్, ఆళ్ల కృష్ణారావు, కర్రి శ్యాం గణేష్, కర్రి దివాకర్ రావు మరియు ఇతర రైతులు పాల్గొని ముంపు ప్రాంతాల్ని దాడి వీరభద్ర రావు గారికి చూపించారు.

ఆర్జీయూకేటీలో ఘనంగా ఐబీఎం క్వాంటమ్ ఫెస్ట్ ప్రారంభం!



శ్రీకాకుళం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్లో ఐబీఎం క్వాంటమ్ ఆధ్వర్యంలో క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్ ఘనంగా ప్రారంభమైంది. నవంబర్ 2 వరకు జరిగే ఈ కార్యక్రమంలో క్వాంటమ్ కంప్యూటింగ్పై వర్క్షాప్లు, హ్యాకథాన్లు, ప్యానెల్ చర్చలు, నివుణుల ప్రసంగాలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహనతో పాటు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ఈ ఫెస్ట్ దోహదపడుతుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంద్ర అమరేంద్ర కుమార్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీకి ఈ అవకాశం రావడం గర్వకారణమని డైరెక్టర్ ప్రొఫెసర్ గిరిధర్ మద్రాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, డీన్ డాక్టర్ శివరామశాస్త్రి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమిని ఓడించేందుకు ఓటుతో తిరగబడండి : మాజీ మంత్రి ధర్మాన

శ్రీకాకుళం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో చైతన్యవంతులైన స్థానిక ప్రజలు తమ నగరం పట్ల కూటమి పార్టీల వైఖరిని, అభివృద్ధి పట్ల వ్యవహరించిన తీరును సమగ్రంగా పరిశీలించి ఓటు హక్కును వినియోగించుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు ధర్మాన ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాశ్రేయస్సును, అభివృద్ధిని విస్మరించి స్వార్థ ప్రయోజనాలతో పాలన సాగిస్తున్న కూటమిలో ఉన్నటువంటి పార్టీలను ప్రశ్నించడానికి, ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేయడానికి ప్రజలకు ఉన్న ఏకైక బలమైన ఆయుధం ఓటు అని గుర్తు చేశారు. శ్రీకాకుళంలో పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, విశాఖపట్నం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. స్థానికంగా బలంగా ఉన్నటువంటి కాపు, యాదవ, గవర వంటి సామాజిక వర్గాలకు రాజకీయ అధికారం లేకుండా చేస్తూ తన సామాజిక వర్గానికి చెందిన వారికి పెత్తనం అప్పగించి అణగదొక్కుతున్న చంద్రబాబుకు గ్రేటర్ విశాఖ ఎన్నికల్లో కూటమిని ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. విశాఖపట్నం రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన నగరంగా ఉన్నా సరే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకపోగా, ఇక్కడి నిధులను తరలించి అమరావతి అభివృద్ధి వినియోగిస్తుండటం చంద్రబాబు నైజానికి నిదర్శనమని ఆక్షేపించారు. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ కు చెందిన రూ. 1738 కోట్లను అమరావతికి తరలించి అక్కడ పనులకు వినియోగించడం చంద్రబాబుకు విశాఖపై ఉన్న సవతితల్లి ప్రేమను తెలియజేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో విశాఖను రాజధానిగా ప్రకటిస్తే అప్పట్లో చంద్రబాబు అడ్డుకునేందుకు కుట్రలు చేసిన సంగతి ప్రజలకు తెలియనది కాదన్నారు. ఈ ప్రెస్ మీట్ లో ధర్మాన ప్రసాదరావు ఇంకా ఏం మాట్లాడరంటే.. విశాఖపట్నంలో విలువైన భూములను ప్రజల అవసరాలకు, నగర అభివృద్ధికి వినియోగించాల్సి ఉండగా, వాటిని ప్రైవేటు సంస్థలకు అతి తక్కువ ధరలకు కేటాయిస్తున్నారు. అభివృద్ధి, ఐటీ కంపెనీల పేరుతో



రూ. 99 పైసలకే అత్యంత విలువైన భూములను తనకు కావాల్సిన వారికి చంద్రబాబు ధారాదత్తం చేస్తున్నారు. తర్లువాడ సమీపంలో అడ్వాన్స్డ్ సిస్టమ్స్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీ సంస్థకు 30 ఎకరాల భూమిని ఎకరాకు ఒక్క రూపాయి చొప్పున కేటాయించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి? రెహేజా కార్పొరేషన్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్కు విశాఖలో విలువైన భూములు కేటాయించడం, మధురవాడలో కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్కు 22 ఎకరాలు కేటాయించడం, బీచ్ రోడ్డులో మరో సంస్థకు 13 ఎకరాలకు పైగా భూమిని 99 సంవత్సరాల లీజుకు ఇవ్వడం వంటి అంశాలపై ప్రజలకు అనుమానాలున్నాయి. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్కు కూడా భూముల కేటాయింపులు జరిగాయి. ఇంత విలువైన భూములను అతి తక్కువ ధరలకు కేటాయించాల్సిన అవసరం ఏమొచ్చింది..? పాల ప్యాకెట్ కూడా 99 పైసలకు దొరకని పరిస్థితుల్లో, కోట్ల రూపాయల విలువైన విశాఖ భూములను ఇంత చౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం వెనుక ఎవరికి ప్రయోజనం కలుగుతోందో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. విశాఖ భూములు ఇక్కడి ప్రజల ఆస్తులు. వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలు స్థానిక ప్రజలకు, నగర అభివృద్ధికే వినియోగించాలి. ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలను పెంచే అనేక కీలక ప్రాజెక్టులు వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. వాటిని కొనసాగించి పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వం ఇప్పుడు కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. టెక్కలి సమీపంలోని డీప్ వాటర్ సీ పోర్టు ప్రాజెక్టు పనులు ఏ మాత్రం ముందుకు సాగడం లేదు. బుడగట్లపాలెం వద్ద సుమారు రూ.400 కోట్లతో చేపట్టాల్సిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని కావాలనే నిలిపివేసారు. అలాగే అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద చేపట్టాల్సిన ఫిషింగ్ హార్బర్ పనులు కూడా ముందుకు సాగడం లేదు. ఈ రెండు ఫిషింగ్ హార్బర్లు పూర్తయి ఉంటే విశాఖ ఫిషింగ్ హార్బర్పై ఒత్తిడి తగ్గడంతో పాటు మరో 500 బోట్లకు అవకాశం కలిగేది. వేలాది మంది మత్స్యకారులకు ఉపాధి లభించేది. మత్స్యకారులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది కాదు. భోగాపురం విమానాశ్రయానికి అవసరమైన రహదారి, ఎక్స్ప్రెస్వే నిర్మాణానికి జగన్ తన ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించి ఆమోదం పొందేలా చేసారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోకపోవడంతో విమానాశ్రయానికి చేరుకోవడానికి కూడా గంటన్నర సమయం పడుతున్న పరిస్థితి దాపురించింది. విశాఖపట్నం పారిశ్రామిక అవసరాలకు, తాగునీటి అవసరాలకు పోలవరం ప్రాజెక్టు ద్వారా నీటిని అందిస్తామని చంద్రబాబు రోజూ గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే పోలవరం బ్యారేజీ ఎత్తు తగ్గించే విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఉత్తరాంధ్రకు నీరు అందించే అంశంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. విశాఖపట్నంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని రణస్థలం తదితర ప్రాంతా లకు తాగునీరు, వ్యవసాయ అవసరాలకు నీరు అందించాల్సిన అవసరం ఉంది. పోలవరం ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్రకు నీటిని తీసుకురావాలన్న లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించడం లేదు. వైఎస్సా ర్ హయాంలో నిర్మించిన కాలువల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని పంపించి, నీరు వచ్చేస్తోందన్న భ్రమ కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఉత్తరాంధ్ర ప్రజల దీర్ఘకాలిక నీటి అవసరాలను తీర్చే సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు విశాఖపట్నం నగరపాలక సంస్థకు చెందిన సుమారు రూ.1,738 కోట్ల నిధులను అమరావతికి తరలించారు. నగరంలో అనేక మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తుంటే, స్థానిక అవసరాలకు వినియోగించాల్సిన ఆ నిధులను మరో ప్రాంతానికి తరలించడం విశాఖ ప్రజలకు అన్యాయం చేయడం కాదా.. విశాఖలో అనేక మురికివాడలు ఉన్నాయి. అక్కడ ప్రజలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వేసవిలో కొన్ని ప్రాంతాల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలో పారిశుద్ధ్య సమస్యలు, పేరుకుపోతున్న చెత్తకుప్పలు, అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అధ్యక్షులు జగన్ బలపరిచిన మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణిని గెలిపించాలి. ఆమెకు శాసనమండలిలో పనిచేసిన అనుభవం ఉంది. ప్రజా సమస్యలను ధైర్యంగా, సమర్థవంతంగా ప్రస్తావించగల సామర్థ్యం పుష్కలంగా ఉంది. శ్రీకాకుళం నుంచి వచ్చి విశాఖపట్నంలో స్థిరపడిన వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఈ నగర అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారు. ముఖ్యంగా గత 80 సంవత్సరాలుగా విశాఖలో స్థిరపడిన శ్రీకాకుళం ప్రజలందరూ వరదు కళ్యాణిని గ్రేటర్ విశాఖ మేయర్ ని చేసేందుకు మద్దతుగా నిలవాలి. నిధుల కేటాయింపులు, నగరపాలక సంస్థ నిధుల తరలింపు, తాగునీటి సమస్య, స్టీల్ ప్లాంట్ భవిష్యత్తు, నిలిచిపోయిన ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలి. విశాఖపట్నం కేవలం ఒక నగరం మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి గుండెకాయ వంటిదని ప్రజలంతా గుర్తించాలి. విశాఖ ప్రజల ఆస్తులను కాపాడుకోవాలన్నా, నగర అభివృద్ధికి నిధులు రావాలంటే, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు ముందుకు సాగాలంటే ప్రజలు చైతన్యంతో నిర్ణయం తీసుకోవాలి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థి వరుదు కళ్యానిని గెలిపించి, విశాఖ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ఓటుతో ప్రజలు తిరగబడాలని ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు.

ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఓటీపీ ధృవీకరణ నుంచి తాత్కాలిక మినహాయింపు : జిల్లా కలెక్టర్ డా.ఆర్ మహేష్ కుమార్

అమలాపురం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ఆర్నబ్ తుఫాన్ కారణంగా ఏర్పడిన అంతరాయాలు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం మొబైల్ నెట్వర్క్ లు మరియు ఇంటర్నెట్ కనెక్టివిటీలో సమస్యలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో గృహ వినియోగ ఎల్ పీ జీ గ్యాస్ సిలిండర్లా పంపిణీకి ఓటీపీ ఆధారిత ధ్రువీకరణ నుంచి తాత్కాలికమైన హాయింపు ఇవ్వడానికి మరియు నగదు చెల్లింపు ద్వారా నేరుగా సిలిండర్లను పొందే విధానాన్ని అమలు చేయడానికి భారత ప్రభుత్వ పెట్రోలియం మరియు సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్పిజి గ్యాస్ బుకింగ్ ప్రజలు ఎటువంటి అపోహలకు తావు ఇవ్వరాదని నేరుగా గ్యాస్ బుకింగ్ కేంద్రాల వద్ద సిలిండర్లు తీసుకోవచ్చని కలెక్టర్ తెలియజేశారు. ఈ వెసులుబాటు 13 జిల్లాలతో పాటు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వర్తిస్తుందని కలెక్టర్ తెలియజేశారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో గృహ వినియోగ ఎల్పిజి సరఫరాకు



అంతరాయం ఎలాంటి కలగకుండా చూడడంతో పాటు వినియోగదారులకు అసౌకర్యాన్ని తగ్గించేందుకు తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ వెసులుబాటు అమల్లో ఉంటుందన్నారు. ఈ వెసులుబాటును ప్రజలు గమనించి అవసరాల మేరకు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాకినాడ జిల్లా పోలీసులు రూ.1.35 కోట్ల విలువైన 270.750 కిలోల గంజాయి పట్టివేత

కాకినాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ఒడిశా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న సుమారు 270.750 కిలోల గంజాయిని ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామ శివారులోని జాతీయ రహదారి-16పై ప్రత్తిపాడు పోలీసులు, ఈగల్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టుకున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ ఏ.బి.జి. తిలక్ పర్యవేక్షణలో, ప్రత్తిపాడు సీఐ బి. సూర్య అప్పారావు సూచనలతో ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్. లక్ష్మీకాంతం తన సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఈ దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులు ఆదిరాజు నాయుడు , రోలుగుంట మండలం బేన్నభూపాలపట్నం మరియు పోతురాజు మణికంఠ అలియాస్ స్వామి, రోలుగుంట మండలం బేన్నభూపాలపట్నం అను వార్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1.35 కోట్ల విలువై న 270.750 కిలోల గంజాయి (8 బస్తాలు), ఆటో-31-డీబీ-9513 నంబరు గల మారుతి వ్యాగనార్ కారు, రెండు ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకు న్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ప్రత్తిపాడు సీఐ తెలిపారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు

అనకాపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సాయంత్రం నక్కపల్లి సీఐ జె. మురళి, ఎస్ఐ సన్నిబాబు మండలంలోని సమ స్యాత్మక గ్రామాలైన న్యాయంపూడి, కాగిత, చిన్నదొడ్డిగల్లు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని సూచించారు.



ఎన్నికల సమయంలో రాజకీయ విభేదాలు, వ్యక్తిగత కక్షలకు తావివ్వకుండా పరస్పర సహకారంతో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు. గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేసినా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ తరఫున అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుత ఎన్నికల నిర్వహణకు తోడ్పడాలని సీఐ మురళి, ఎస్ఐ సన్నిబాబు గ్రామస్తులకు సూచించారూ.

జిల్లా లోని 6 మున్సిపాలిటీల్లో ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్ 31, నవంబర్ 3 తేదీల్లో స్థానిక సెలవులు

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



కాకినాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా లోని తుని, పెద్దాపురం,పిఠాపురం, సామర్లకోట,ఏలేశ్వరం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నవంబర్ 1వ తేదీ(ఆదివారం) నిర్వహించనున్న నేపథ్యం లో,ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహిం చేందుకు అక్టోబర్ 31వ తేదీ (శనివారం) ,నవంబర్ 3వ తేదీ (మంగళవారం) స్థానిక సెలవులుగా ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ మరి యు జిల్లా ఎన్నికల అధికారి ఎం.ఎన్. హరేం ధిర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పోలింగ్ కు ముందు రోజైన అక్టోబర్ 31వ తేదీ,ఓట్ల లెక్కింపు జరిగే నవంబర్ 3వ తేదీల్లో స్థానిక సెలవులు వర్తిస్తాయని తెలిపారు . ఈ సెలవులు పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యాసంస్థలు,ఇతర సంస్థలకు వర్తిస్తాయని తెలిపారు. ఎన్నికలకు సంబంధిం చిన ముందస్తు ఏర్పాట్లు, పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు కార్యక్రమాల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. సంబంధిత అధికారులు ఈ ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహాలు వేగవంతం

అనకాపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): శుక్రవారం రాబోయే స్థానిక ఎన్నికల నిర్వహణ సిద్ధతపై యలమంచిలి మున్సిపల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఉదయం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మరియు జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ తో కలిసి స్థానిక ఎన్నికలపై అధికారులు, మున్సిపల్ మరియు రెవెన్యూ యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, షెడ్లు, దివ్యాంగులకు ర్యాంప్ సదుపాయాలు వంటి మౌలిక వసతులు పక్కాగా ఉన్నదీ లేనిదీ క్షేత్రస్థాయిలో పరిశీలిం చాలని అధికారుల కు సూచించారు. ఓటర్ల జాబితాలో సవరణలు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, అక్కడ అదనపు బందోబస్తు మరియు వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

అవినీతి రహిత సేవలే ప్రభుత్వ లక్ష్యం

సమగ్రతతోనే సమృద్ధి సాధించవచ్చు..ఏసీబీ ఇన్స్పెక్టర్ కే. గోవిందరాజు స్పష్టీకరణ



కాకినాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ప్రజా సంక్షేమం, పాలనలో పారదర్శకత ప్రతి ఉద్యోగి బాధ్యత అని రాజమహేంద్రవరం ఏసీబీ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే. గోవిందరాజు స్పష్టం చేశారు. అవినీతి రహిత సమాజ స్థాపక,పాలనలో పారదర్శకత ప్రదర్శించడమే లక్ష్యంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రాజమహేంద్రవరం పరిధిలో 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ - 2026' (అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల) కార్యక్రమాన్ని శుక్రవారం కాకినాడ విక్టోరియా వాటర్ వర్క్స్ లోని స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ, అవినీతి నిరోధక శాఖ రాజమహేంద్రవరం రేంజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. గోవింద రాజు, అదనపు డిప్యూటీ కమిషనర్ కే.టీ. సుధాకర్ ముఖ్య అతిథు లుగా హాజరై, నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బం దికి పలు కీలక విషయాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీబీ రాజమహేంద్రవరం రేంజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. గోవిందరాజుమాట్లాడుతూ.. అక్టోబర్ 26 నుండి నవంబర్ 01 వరకు "సమగ్రతతో సమృద్ధి" అనే ఇతివృత్తంతో అవగాహన వారోత్స వాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఉద్యోగి తమకు కేటాయించిన బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. నేటి సాంకేతిక యుగంలో ప్రతి దర ఖాస్తు, దస్త్రం (ఫైల్) ఆన్‌లైన్ ద్వారా ట్రాక్ చేసే సదుపాయం ప్రజలకు అందుబాటులోఉందన్నారు. కాబట్టి విధుల్లో అనవసర జాప్యం,నిర్లక్ష్యం వహిస్తే విజిలెన్స్,ఏసీబీ తనిఖీల్లో కేసులు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రతి పనిలోనూ పారదర్శకత, జవాబు దారీతనం పాటించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఉద్యోగి ప్రతి ఏటా తమ వార్షిక ఆస్తుల వివరాలను సమర్పిం చాలని అధికా రులను ఆదేశించారు. రూ. లక్ష దాటిన విలువున్న వాహనాలు, భూములు లేదా ఇతర ఆస్తులను కొనుగోలు చేసేటప్పుడు విధిగా ముందస్తు అనుమతులు పొందడం లేదా వార్షిక ఆస్తుల నివేదికలో నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగుల కు రక్షణగా నిలుస్తుంద న్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కేవలం లంచం తీసుకోవడమే కాకుండా, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించినా లేదా లంచం కోసం డిమాండ్ చేసిన ఆధారాలు లభించినా అవినీతి నిరోధక చట్టం కింద చర్యలు ఉంటా యని ఇన్స్పెక్టర్ తెలి పారు. ఏసీబీ కేసుల్లో చిక్కుకుంటే ఉద్యోగ అవకాశాలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు కోల్పోవ డమే కాకుండా కుటుంబం కూడా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటారని ఆయన వివరించారు. దేశ ఆర్థిక, రాజకీయ సామాజిక పురోగతికి అవినీతి ఒక ప్రధాన ముప్పని, దానిని రూపుమాపేందుకు ప్రభుత్వం, ప్రజలు, ప్రైవేటు రంగం కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తూ నీతి, సమగ్రత ప్రమాణాలను పాటిస్తూ అవినీతి వ్యతిరేక పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా 'సమగ్రతతో సమృద్ధి' భావనను పెంపొందిం చేలా ఆయన ఉద్యోగు లచే ప్రతిజ్ఞ చేయించారు. సేవల్లో ఏవైనా అవినీతికి సంబంధించిన ఫిర్యాదు లు ఉంటే ప్రజలు, ఉద్యోగులు ఏసీబీ ఉచిత ఫోన్ నంబర్ 1064 కు గానీ, ల్యాండ్‌లైన్ నంబర్లు 0866- 2428770, 9440440057 కు గానీ, లేదా ప్రత్యక్ష ఇన్స్పెక్టర్లను సంప్రదించవచ్చని వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ప్రతి ఉద్యోగి నియమ నిబంధనలపై అవగాహన పెంపొందిం చుకోవాలన్నారు. తమ పరిధిలోని దరఖాస్తు, దస్త్రాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అత్యంత పారదర్శకత్వంతో పనిచేయాలని కోరారు . కార్యక్రమంలో నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, స్వర్ణ వార్డు సిబ్బంది, ఇతర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జీవీఎంసీ ఎన్నికల్లో కూటమిని గెలిపించండి



విశాఖ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ ఎన్నికల్లో కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని విశాఖ ప్రజలను విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. విడుదల చేసిన పత్రిక ప్రకటన లో మంత్రి మాట్లాడుతూ....నవంబర్ 1 తేదీన జరగనున్న జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత 5 ఏళు ళ దందాలు దౌర్జన్యాలు, భూ కబ్జాలు తప్ప విశాఖ నగరానికి వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కూటమి రెండున్నరేళ్ల పాలనలోనే విశాఖ నగరానికి ప్రతిష్టాత్మక సంస్థ గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలు, పెట్టుబడులు తీసుకువచ్చి యువ తకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించా మన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ విశాఖ ను ఐటీ హబ్ గా దేశంలోనే నెం.1 సిటీగా తీర్చి దిద్దుతున్నా రన్నారు. విశాఖ నగరంలో 28,500 మంది పేదలకు ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసి పేదల సొం తింటి కల నిజం చేశామన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల కల విశాఖ రైల్వే జోన్ సాధించామని, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. పోల వరం ఎడమ కాలువ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు నీరు అందించామన్నారు. పెట్టుబడులు ఆకర్షి ంచేందుకు పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నిర్వహించామని, యోగాంధ్ర వంటి భారీ కార్యక్రమాల నిర్వహణతో అంతర్జా తీయ స్థాయిలో విశాఖ ఖ్యాతి మరింత పెంచామని తెలిపారు. కూటమి పాలనలో నగరంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అభివృద్ధిని ఆదరించే మనస్తత్వం ఉన్న విశాఖ నగర ప్రజలు మరోసారి జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.

ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును ప్రతిఒక్క ఓటరు సద్వినియోగం చేసుకో వాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పిలుపునిచ్చారు. నవంబర్ 1న జరిగే జీవీఎంసీ ఎన్నికలలో ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరున్నవారు ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల ఐడెంటిటీ కార్డులలో ఏదైనా ఒక ఐడెంటిటీ కార్డు తీసుకుని పోలింగ్ స్టేషన్ కు వెళ్లాలని స్పష్టం చేశారు. పోలింగ్ బూత్ వద్ద రెండు బ్యాలెట్ పత్రాలు ఇస్తారని, పింక్ కలర్ మేయర్ అభ్యర్థి , తెలుపు రంగు బ్యాలెట్ కార్పొరేటర్ అభ్యర్థి ఓటింగ్ కోసం ఇవ్వడం జరుగుతుందని, ఓటు వేసిన తర్వాత రెండు బ్యాలెట్ పత్రాల ను ఒకే బ్యాలెట్ బాక్సు లో వేయాలని తెలిపారు. జీవీఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా , పారదర్శకంగా నిర్వహించ డానికి అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

ఓటరు తీసుకెళ్లవలసిన ఐడెంటిటీ కార్డు:

ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్ పోర్ట్, పోస్టాఫీసు పాస్ బుక్, యాది వేతన జాబ్ కార్డ్, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, సర్వీస్ ఐడి కార్డు, ఎన్ పి ఆర్ స్మార్ట్ కార్డ్, ఎం.పి, ఎం ఎల్ ఏ, ఎంఎల్సి లకు జారీ చేసిన అఫిషియల్ ఐడి కార్డు, వికలాంగుల కార్డ్ లలో ఏదైనా ఒక కార్డు ను తీసుకువెళ్లాలి.

ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ..కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



కాకినాడ రూరల్ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): : కాకినాడ రూరల్ జడ్పీటీసీ కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి శుక్రవారం కొవ్వూరు గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. కొవ్వూరు ఎంపీటీసీ-1 అభ్యర్థిని తోటకూర పద్మశ్రీ, ఎంపీటీసీ-2 అభ్యర్థి ఈరెళ్ల రాజ్‌కుమార్‌లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో నియోజ కవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలను వివరిస్తూ మరోసారి ప్రజా సేవకు అవకాశం కల్పించాలని కోరా రు. జడ్పీటీసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై, ఎంపీటీసీ ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పిల్లి అనం తలక్ష్మి మాట్లా డుతూ.. జడ్పీటీసీ సభ్యురాలిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, ఎమ్మెల్యే గా, కాకినాడ రూరల్ నియోజ కవర్గ ఇన్‌ఛార్జిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించానన్నారు. తన రాజకీయ అనుభవం, ప్రజాసేవను గుర్తించిన పార్టీ అధిష్టానం సూచనల మేరకు మరోసారి జడ్పీటీసీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కాకినాడ జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి తన పేరును పార్టీ పరిశీలనలో ఉంచిన నేపథ్యంలో, పార్టీ పెద్దల ఆదేశాల మేరకు ఎన్నికల బరిలో నిలిచానన్నారు. ఓసీ జనరల్ కేటగిరీలో మహిళకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా అవకాశం ఉండటం, బీసీలకు పార్టీ పరంగా 40 శాతం ప్రాధాన్యం కల్పించాలనే నిర్ణయం నేపథ్యంలో జిల్లా స్థాయిలో మరింత విస్తృతంగా ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు తనకు, కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు.

సామాజిక సేవలో నారా లోకేష్ యువజన ఫౌండేషన్



కాకినాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ఆర్నాబ్ తుఫాను సృష్టించిన పెను విధ్వంసం తాకిడికి ప్రజా జీవనం అతలా కుతలం అయిందని నారా లోకేష్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడ చూసినా భారీ వృక్షాలు నేల కూలడంతో ఫౌండేషన్ తరఫున పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా స్థానిక సంత చెరువు పార్కులో నేల కూలిన వృక్షాలను తొలగిం చారు. అదే విధంగా పలు ప్రాంతాల్లోని తుఫాను బాధితులకు భోజన ఏర్పాట్లు చేశారు.ఈసందర్భంగా మండపాక సుబ్బు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అపార అనుభవంతో అధికార యంత్రంగాన్ని అప్రమత్తం చేసి ప్రాణనష్టం లేకుండా, నష్టాల తీవ్రత తగ్గిం చడంలో చేసిన కృషి అభినంద నీయమని అన్నారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ బద్రి మరియు వారి సౌజన్యం, జిల్లా అధ్యక్షులు బత్తుల నూర్యప్రసాద్ ప్రత్తిపాడు ఫౌండేషన్ అధ్యక్షులు అడపా జగదీష్ రూరల్ ఫౌండేషన్ అధ్యక్షులు మండపాక నాగబాబు కాలాడి వెంకటేష్ కడియం ఏసుబాబు వలస కూలీలు ఫౌండేషన్ సభ్యులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్నబ్ తుపాను ప్రభావం,ముందస్తు రక్షణ చర్యలు, పునరావాసంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి నివేదించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్,ఎస్పీ జి. బిందు మాధవ్



కాకినాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపిన 'అర్నబ్' తుపాను గమనం, ముందస్తుగా యంత్రాంగం చేపట్టిన రక్షణ చర్యలు, సంభవించిన ప్రాథమిక ఆస్తి,పంట నష్టాలు మరియు కొనసాగుతున్న సహాయక పునరావాస కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా తీసుకున్న పటిష్ఠమైన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. తుపాను తీవ్రత, వర్షపాతం వివరాలను కలెక్టర్ వివరిస్తూ -అక్టోబర్ 25న కాకినాడకు తూర్పు-ఆగ్నేయంగా 820 కి.మీ దూరంలో ఏర్పడిన అర్నబ్ తీవ్ర తుపాను, అక్టోబర్ 27 సాయంత్రానికి గంటకు 112 కి.మీ వేగంతో పెనుగాలులు వీచి, అక్టోబర్ 28న తెల్లవారుజామున 1:20 గంటలకు యానాం సమీపంలో తీరం దాటిందని పేర్కొన్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 140 కి.మీ వేగంతో భీకర గాలులు వీచడంతో పాటు 1.0 నుండి 1.5 మీటర్ల ఎత్తున అలల ఉధృతి చోటుచేసుకుందని తెలిపారు. జిల్లాలోని మొత్తం 21 మండలాల్లో రెండు రోజుల్లో సగటున 186 మి.మీ భారీ వర్షపాతం నమోదైందని, అందులో పిఠాపురం నియోజకవర్గం లో రికార్డు స్థాయిలో వర్షం కురిసిందని వివరించారు. పిఠాపురం మండలంలో 269.0 మి.మీ, యు.కొత్తపల్లిలో 257.4 మి.మీ, గొల్లప్రోలులో 232.6 మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. గర్భిణీ స్త్రీలను ముందుగానే ఆసుపత్రులకు చేర్చి, పీహెచ్‌సీలలో బ్యాకప్ ఇన్వర్టర్లు,మందులు '108' వాహనాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. పిఠాపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో 55 పునరావాస కేంద్రాలు సిద్ధం చేయగా, యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, కొనపాపపేట, సుబ్బంపేట, అమీనాబాద్ తదితర 7 తీర గ్రామాల నుంచి 4,452 మందిని 14 కేంద్రాలకు తరలించారు. శిబిరాల్లో ఉన్నవారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం కోడిగుడ్లతో పౌష్టికాహారం, పిల్లలకు పాలు అందించడంతో పాటు 21,336 ఆహార ప్యాకెట్లు, 25,000 తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. 14 ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించారు. ప్రమాద నివారణ కోసం రాత్రి 8 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు రాకపోకలను నియంత్రించి, ఉప్పాడ బీచ్ రోడ్డును పూర్తిగా మూసివేసి నిరంతర నిఘా ఉంచినట్లు తెలిపారు. బాధితులందరికీ ఉచిత నిత్యావసర సరుకులు అందజేయనున్నట్లు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముంపు ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం చల్లడం, ఫాగింగ్ చేయిస్తూ, తాగునీటికి క్లోరినేషన్ పరీక్షిస్తున్నామని, జిల్లాలో 63 వైద్య శిబిరాలు నిరంతరం కొనసాగుతున్నాయని వివరించారు.. సముద్రపు కోత నుంచి తీరప్రాంతాన్ని శాశ్వతంగా పరిరక్షించేందుకు 'సీ-వాల్' నిర్మాణం, కోత ముప్పు ఉన్న మత్స్యకార కుటుంబాలకు సురక్షిత ప్రాంతాల్లో శాశ్వత గృహ నిర్మాణాల ప్రతిపాదనలను అత్యంత వేగంగా సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి నివేదించారు. జీరో క్యాజువాలిటీ' లక్ష్యంతో జిల్లా యంత్రాంగం పనిచేసి తీరప్రాంతాల్లో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా కాపాడగలిగిందని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఉప ముఖ్యమంత్రికి నివేదించారు. వేటకు వెళ్లి తప్పిపోయిన ముగ్గురు మత్స్యకారులను గాలించి క్షేమంగా ఒడ్డుకు చేర్చామని తెలిపారు. 6 తీర మండలాల్లోని 92 సమస్యాత్మక ఆవాసాలను గుర్తించి, 50,700 మంది సామర్థ్యంతో 102 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, గరిష్టంగా దాదాపు 20,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వివరించారు. 62 గ్రామాల్లో, 12 హైవే పాయింట్లలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, తీరప్రాంతాన్ని వదిలి రావడానికి నిరాకరించిన మత్స్యకార కుటుంబాలను ఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ బృందాలు స్వయంగా డోర్-టు-డోర్ వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి ఒప్పించారని పేర్కొన్నారు. తీరం దాటే సమయానికి 4,602 వేట పడవలను ఒడ్డుకు చేర్చి సముద్రంలో ఏ ఒక్క బోటు లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని, అక్టోబర్ 26 నుండి 30 వరకు వేటను పూర్తిగా నిషేధించామని తెలిపారు.

తుపాన్ బాధిత మత్స్యకార కుటుంబాలకు కూటమి నాయకుల పరామర్శ



నక్కపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త) : అర్నబ్ తుపాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన వలస మత్స్యకార కుటుంబాలను కూటమి నాయకులు, కార్యకర్తలు, పరామర్శించారు. తూర్పు గోదావరి జిల్లాలోని నిలారేవు, గచ్చికాయల పార, వాసాలతిప్ప, నక్క రామేశ్వరం, అంతర్వేది, తదితర గ్రామాల్లో వలస ఉంటున్న రాజయ్య పేట మత్స్యకార కుటుంబాలను నాయకులు కలిసి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 100 బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, కూరగాయలను పంపిణీ చేశారు. తుపాన్ కారణంగా మత్స్యకారుల బోట్లు, వలలు, ఇంజిన్లకు తీవ్ర నష్టం వాటిల్లడంతో బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులు తెలుసుకున్నారు. ఈ కష్టకాలంలో మత్స్యకార కుటుంబాలకు మనోధైర్యం కల్పిస్తూ, ఆర్థికంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మత్స్యకారులకు జరిగిన నష్టాన్ని హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబాలకు తగిన సహాయం అందేలా కృషి చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఏరిపల్లి బంగారి, రాజయ్యపేట కూటమి సర్పంచ్ అభ్యర్థి పిక్కి కోదండరావు, రాజయ్యపేట తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, పూజారి పిక్కి దేముడు, కారే రాజు, పిక్కి కాశి, పిక్కి సత్తియ్య కారే రాజు పిక్కి వాసు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో మద్యం దుకాణాలు మూసివేయాలి



నెల్లూరు , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలోని పట్టణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్, ఓట్ల లెక్కింపు రోజుల్లో మద్యం విక్రయాలపై పూర్తి నిషేధం విధిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ, ఆత్మకూరు మున్సిపాలిటీ, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలలో నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మున్సిపల్ చట్ట నిబంధనల మేరకు పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుంచే సంబంధిత ఎన్నికల ప్రాంతాల్లో మద్యం విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పోలింగ్ రోజైన నవంబర్ 1వ తేదీతో పాటు, కౌంటింగ్ రోజైన నవంబర్ 3వ తేదీన కూడా మద్యం దుకాణాలను పూర్తిగా మూసివేయాలని స్పష్టం చేశారు. ఈ సమయంలో హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, క్లబ్బులు, బార్లు లేదా ఇతర బహిరంగ, వ్యక్తిగత ప్రదేశాల్లో ఎలాంటి మద్యం, మత్తు పదార్థాల విక్రయం లేదా పంపిణీ చేయ రాదని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను పకడ్బం దీగా అమలు చేసి నివేదిక సమర్పిం చాలని నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ను ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిపితే సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

గ్రేటర్ విశాఖ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకొని డబుల్ ఇంజన్ నుండి త్రిపుల్ ఇంజన్ సర్కార్ గా మార్చుతా : పల్లా శ్రీనివాసరావు




గాజువాక , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): గాజువాక టిడిపి పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేసిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు జనసేన గాజువాక ఇంచార్జ్ కోన తాతారావు బిజెపి గాజువాక కోఆర్డినేటర్ కర్రం రెడ్డి నరసింహారావు. పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ... విశాఖ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ముగింపు నేపథ్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సాయంత్రం కూటమి నేతలతో కలిసి మీడియా సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 22 మంది కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యతను కూటమి శ్రేణులన్నీ భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారు... కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ పైన ఉన్న నమ్మకంతోనే పెద్ద ఎత్తున పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని, ప్రజలంతా ఆలోచించి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. గత ఐదేళ్ల వైసిపి పాలన కేవలం కక్ష సాధింపులు, విధ్వంసానికే పరిమితమైందని తీవ్రంగా ధ్వజమెత్తారు...తాము అధికారంలోకి వచ్చి చెప్పిందే చేశామని, ఇచ్చిన హామీలను నెరవేరు స్తున్నామని స్పష్టం చేశారు.

ఇందులో భాగంగానే 4వేల పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టామని, ఈ రోజు ఎక్కడికి వెళ్లినా మహిళలు పథకాలను ప్రశంసిస్తూ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని హర్షం వ్యక్తం చేశారు... ఇటీవల వచ్చిన ప్రమా దకరమైన తుఫాన్లను కూడా ప్రభుత్వం ముందు చూపుతో, అన్ని శాఖలను సమన్వయం చేస్తూ సమర్థ వంతంగా ఎదుర్కొని ప్రజలను కాపాడిందని ఆయన గుర్తుచేశారు ...గాజువాక ప్రెస్ మీట్ లో మాట్లాడుతున్నావ్ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్తి కిశోర్ అధికారులను ఆదేశించారు. పీఎం పాలెం పరిధిలోని సాంకేతిక కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సామగ్రి పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్లు, పోలింగ్ సిబ్బంది రాకపోకలకు సంబంధించిన మార్గాలు, క్యూ లైన్లు, వాహనాల పార్కింగ్, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు తదితర అంశాలను పరిశీలించారు.

మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ కృతిక శుక్ల



నరసరావుపేట , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): జిల్లాలోని వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల, సత్తెనపల్లి నాలుగు మున్సిపాలిటీల్లో నవంబర్ 1న జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల తెలిపారు. జిల్లాలో 118 పోలింగ్ లొకేషన్లలో 308 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1,840 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. మొత్తం 156 వార్డుల్లో 398 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,28,456 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. చిలకలూరిపేటలో అత్యధికంగా 86,554 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 117 సమస్యాత్మక, 95 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, నిఘా బృందాలతో పటిష్ట భద్రత కల్పిస్తున్నామన్నారు. అక్టోబర్ 31న పోలింగ్ సామగ్రి పంపిణీ చేయనున్నట్లు, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజలందరూ నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేం దుకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పేదల జీవితాలతో గత వైసీపీ ప్రభుత్వం చెలగాటం

అర్నాబ్ తుఫాన్‌తో బయటపడిన జగనన్న కాలనీ వాస్తవ పరిస్థితులు..బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు భరోసా



కాకినాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): పేదలకు సొంతింటి కల నెరవేరుస్తామనే పేరుతో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, ప్రకృతి వైపరీత్యాల ముప్పు పొంచి ఉన్న ప్రాంతంలో ఇంటి స్థలాలు పంపిణీ చేసి వారి జీవితాలను ప్రమాదంలోకి నెట్టిన గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకానికి కొమరగిరి లేఅవుట్ జగనన్న కాలనీ దుస్థితి నిలువెత్తు నిదర్శనమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. పేదల సంక్షేమం కంటే స్వప్రయోజనాలు, ధనదాహానికే ప్రాధాన్యత ఇచ్చిన నాటి పాలకుల అసమర్థ నిర్ణయాలకు అర్నాబ్ తుఫాన్ సృష్టించిన బీభత్సం సజీవ సాక్ష్యంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై ఘాటుగా విరుచుకుపడ్డారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన కాకినాడ నగర పరిధిలోని కొమరగిరి లేఅవుట్ జగనన్న కాలనీలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. తుఫాన్ కారణంగా ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన నష్టాన్ని పరిశీలించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తమ కష్టాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తుఫాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కనీసం తాగేందుకు మంచినీరు కూడా అందుబాటులో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలో దొంగతనాలు కూడా అధికమయ్యాయని తెలిపారు. కనీస సదుపాయాలు లేకపోవడంతో నిత్యం అనేక అవస్థలు పడుతున్నామని మహిళలు వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొమరగిరి లేఅవుట్‌లో 16,601 మందికి ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేయగా, వారిలో 9,727 మందికి ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేశారని తెలిపారు. సుమారు 1,800 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ ప్రస్తుతం కేవలం 165 మంది మాత్రమే ఈ కాలనీలో నివాసం ఉంటున్నారని వెల్లడించారు. దీనికి ప్రధాన కారణం అక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడమేనని స్పష్టం చేశారు.

ప్రమాదం పొంచి ఉందని చెప్పినా పట్టాల పంపిణీ.. పేదల ప్రాణాలతో చెలగాటం!

కొమరగిరి ప్రాంతం సముద్ర అలల ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని, ఉప్పాడ, సుబ్బంపేట ప్రాంతాల్లో మాదిరిగా భవిష్యత్తులో తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని అప్పట్లోనే హెచ్చరించినప్పటికీ నాటి పాలకులు పట్టించుకోలేదని కొండబాబు ఆరోపించారు. ప్రమాదకర పరిస్థితులపై సూచనలు చేసినా, అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేదలకు ఇక్కడ ఇంటి స్థలాలు కేటాయించి వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చారని మండిపడ్డారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం తప్ప, వారు అక్కడ ఎలా జీవించాలనే కనీస ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. ఒక ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నప్పుడు అక్కడికి అవసరమైన రహదారులు, తాగునీరు, విద్యుత్, ఆసుపత్రి, పాఠశాల వంటి కనీస సదుపాయాలను ముందుగానే కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుందని పేర్కొన్నారు. కానీ కొమరగిరి లేఅవుట్‌లో అలాంటి సదుపాయాలేవీ కల్పించకుండా వేలాది మంది పేదలకు పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలు, భద్రతను పక్కనపెట్టి రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చిన గత పాలకుల వైఖరికి నేటి పరిస్థితులే నిదర్శనమన్నారు. పేదలకు ఇళ్లు ఇచ్చామని చెప్పుకుంటూ వారిని కనీస వసతులు లేని ప్రాంతంలోకి పంపించడం ఏ రకమైన సంక్షేమమని ద్వారంపూడిని ప్రశ్నించారు. పేదల జీవితాలతో రాజకీయ ప్రయోగాలు చేయడం, వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం క్షమించరాని విషయమని అన్నారు. అర్నాబ్ తుఫాన్‌తో వెలు గులోకి వచ్చిన వాస్తవ పరిస్థితులు గత పాలకుల పాలనా వైఫల్యాలను మరోసారి బహిర్గతం చేశాయని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ ం ముందస్తు చర్యలు చేపడు తోందని ఎమ్మెల్యే తెలిపారు. కొమరగిరి లేఅవుట్‌లో తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు కృషి చేస్తామని, బాధితులకు నష్టపరి హారం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రవాణా, భద్రత తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కాకినాడలోని టిడ్కో గృహ సముదాయాన్ని సందర్శించి అక్కడ కల్పించిన మౌలిక సదుపా యాలను పరిశీలి ంచారు. ఈ సందర్భంగా టిడ్కో గృహాల వద్ద చేపట్టిన సదుపాయాలను మీడియా కు వివరించారు. ఈ కార్యక్ర మంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గుమ్మల చిన్న, యాదవ్ శ్రీను, నిద్రపుంగి సత్తి బాబు, తదితరులు పాల్గొన్నారు.

58 వ డివిజన్ లో బొడ్డు నాగలక్ష్మి ఇంటింటి ప్రచారం

విజయవాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో చివరి రోజైన తెలుగు సంస్కృత అకాడమి చైర్మన్ ఆర్‌డి విల్సన్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ బీజేపీ శ్రేణులతో కలిసి బొడ్డు నాగలక్ష్మి కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డు నాగలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఎమ్మెల్యే సుజనా చౌదరి నాయకత్వంలో పశ్చిమ లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. 58 వ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ బాసటగా నిలుస్తానని ఆమె స్పష్టం చేశారు. మరింత అభివృద్ధి కొరకు కూటమి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధా కృష్ణ కు గ్లాస్ గుర్తుపై, తనకు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బొడ్డు నాగలక్ష్మి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు...

నర్సీపట్నం మున్సిపాలిటీ 1,2,3 వార్డుల్లో వైసీపీకి షాక్



- టీడీపీలో చేరిన 300 మంది
- పీనరిపాలెం బీసీ కాలనీ లో చేరికలతో వార్ వన్ సైడ్
- కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి వేగవంతం: ఎంపీ చింతకాయల విజయ్

నర్సీపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3 వార్డులలో సుమారు 300 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ వార్డుల్లో పర్యటించిన రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ సమక్షంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో ఈ మూడు వార్డుల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసే దిశగా వాతావరణం కనిపిస్తోందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఎన్నికల ప్రచారం లో భాగంగా కలాసి కాలనీ, ధోబీ కాలనీ, బీసీ కాలనీల్లో పర్యటించిన విజయ్‌కు మహిళ లు పూలవర్షం, హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ కాలనీలో షేక్ అలీ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, మంతెన దుర్గ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు, మాజీ వార్డు మెంబర్ ఎం. చందర్రావు కుమారుడు శ్రీనివాసరావు కుటుంబం, శృంగవరపు రాజేష్ కుటుంబం, లాలం మురళి ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. విజయ్ వారందరికీ సాదరంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. ముస్లిం సోదరుల సమాజ్ కోసం 2014-19 మధ్య మంత్రిగా ఉన్న సమయంలో అయ్యన్నపాత్రుడు 10 సెంట్ల స్థలం కేటాయిస్తే, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం అందులోంచి 5 సెంట్లు వెనక్కి తీసుకుందని విమర్శించారు. చైర్‌పర్సన్ అభ్యర్థి పద్మావతి గెలిచిన వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే, ఈ కాలనీల్లో 40 ఏళ్లుగా ఇళ్ల పట్టాలు లేకుండా ఉన్న వారికి డిసెంబర్ నెలలో సుమారు 200కు పైగా పట్టాలు పంపిణీ చేసేలా సర్వే పూర్తి చేశామని ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని విజయ్ స్పష్టం చేశారు. మంచినీటి ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని, తమ ప్రభుత్వం రూ. 185 కోట్లతో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు తీసుకొస్తు ందని ఆయన వివరించారు. పవన్ కళ్యాణ్ నర్సీపట్నం తాగునీటి ప్రాజెక్టు కోసం రూ. 500 కోట్లు కేటాయించారని, రోడ్ల అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 82 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అధికారంలో ఉన్న కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే నిధులు సకాలంలో వస్తాయని, అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సైకిల్ గుర్తుపై, అలాగే 29వ వార్డులో ఉంగరం గుర్తుపై ఉన్న అభ్యర్థికి, కూటమి బలపరిచిన ఇతర అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

తుఫాన్‌తో అల్లూరి జిల్లాలో రూ.50.46 కోట్ల మేర నష్టం అంచనా

పాడేరు , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాన్ ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాల్లో వివిధ శాఖలకు సంబంధించి భారీ నష్టం వాటిల్లినట్లు జిల్లా యంత్రాంగం చేపట్టిన సమగ్ర నష్టం అంచనా ప్రక్రియలో వెల్లడైంది. వివిధ శాఖల నుంచి సేకరించిన వివరాలు, క్షేత్రస్థాయి అంచనాల ఆధారంగా జిల్లాలో మొత్తం రూ.5,045.86 లక్షలు (సుమారు రూ.50.46 కోట్లు) మేర నష్టం జరిగినట్లు అంచనా వేశారు. తుఫాన్ ప్రభావంతో ముఖ్యంగా రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్ రహదారులు, చిన్న నీటిపారుదల వనరులు, గృహాలు, పశుసంపదకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని అనంతగిరి నుంచి జి.కె.వీధి వరకు మొత్తం 11 మండలాల్లో నష్టాలను వివిధ శాఖల అధికారులు అంచనా వేశారు. మండలాల వారీగా పరిశీలిస్తే జి.మాడుగుల మండలంలో అత్యధికంగా రూ.1,200.29 లక్షలు (రూ.12 కోట్లకు పైగా) నష్టం నమోదైంది. జి.కె.వీధి మండలంలో రూ.1,027.65 లక్షలు (సుమారు రూ.10.28 కోట్లు), పాడేరు మండలంలో రూ.608.28 లక్షలు (సుమారు రూ.6.08 కోట్లు) నష్టం అంచనా వేశారు.

ఇతర మండలాల్లో నమోదైన నష్టం వివరాలు:
అరకులోయ -- రూ.583.99 లక్షలు , అనంతగిరి -- రూ.499.09 లక్షలు , డుంబ్రిగూడ -- రూ.476.20 లక్షలు , ముంచంగిపుట్టు -- రూ.303.36 లక్షలు , హుకుంపేట -- రూ.174.10 లక్షలు , పెదబయలు -- రూ.149.38 లక్షలు, చింతపల్లి -- రూ.22.19 లక్షలు, కొయ్యూరు -- రూ.1.33 లక్షలు , శాఖల వారీగా నష్టం వివరాలు , తుఫాన్ కారణంగా వివిధ శాఖలకు జరిగిన నష్టాన్ని పరిశీలిస్తే రోడ్లు, భవనాల శాఖకు అత్యధికంగా రూ.3,372.92 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

శాఖల వారీగా నష్టం వివరాలు ఇలా ఉన్నాయి:
రోడ్లు, భవనాల శాఖ: రూ.3,372.92 లక్షలు , పంచాయతీరాజ్ శాఖ: రూ.1,085.20 లక్షలు , చిన్న నీటిపారుదల శాఖ: రూ.351.00 లక్షలు , గృహాల నష్టం: రూ.109.90 లక్షలు , పశుసంవర్ధక శాఖ: రూ.64.68 లక్షలు , ఇతర శాఖలు: రూ.62.16 లక్షలు ..మొత్తంగా అన్ని శాఖలకు కలిపి రూ.5,045.86 లక్షల మేర నష్టం అంచనా వేశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారులు కోతకు గురయ్యాయి. రోడ్లపై వరద నీరు ప్రవహించడం, రోడ్లకు గండ్లు పడటం, కల్వర్టులు దెబ్బతినడం, కొండచరియలు విరిగిపడటం వంటి సమస్యలు తలెత్తాయి. రోడ్ల పునరుద్ధరణ, మరమ్మతులకు సంబంధించి తాత్కాలిక, శాశ్వత పనుల అంచనాలను సంబంధిత శాఖలు రూపొందించాయి. అదేవిధంగా పంచాయతీరాజ్ పరిధిలోని రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు కూడా గణనీయమైన నష్టం వాటిల్లింది. చిన్న నీటిపారుదల వనరులు దెబ్బతినడంతో వాటి పునరుద్ధరణకు కూడా అంచనాలు రూపొందించారు. తుఫాన్ కారణంగా జిల్లాలో సుమారు 587 హెక్టార్ల వ్యవసాయ, ఉద్యానవన పంటలు ప్రభావితమైనట్లు ప్రాథమిక సమగ్ర నివేదికలో పేర్కొన్నారు. ఇందులో సుమారు 280 హెక్టార్ల వ్యవసాయ పంటలు, 307 హెక్టార్ల ఉద్యానవన పంటలు ఉన్నాయి. వరి, మొక్కజొన్న, రాగులు, సామలు, మినుములు, రాజ్మా తదితర వ్యవసాయ పంటలతో పాటు అరటి, టమాటా, అల్లం, పసుపు, కాఫీ, మిరియాలు, పూలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టానికి సంబంధించిన వివరాలు మండలాల వారీ ఆర్థిక నష్టం పట్టికలో చేర్చలేదని నివేదికలో పేర్కొన్నారు.తుఫాన్ సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల నుంచి 474 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 11 సహాయ శిబిరాల్లో 422 మందికి ఆశ్రయం కల్పించారు.

ఆర్నబ్ తుపాను నష్టం పై ముఖ్యమంత్రి తో మాట్లాడండి

.నర్సీపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): ఆర్నబ్ తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉత్తరాంధ్ర లో జరిగిన భారీ పంట నష్టాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో మాట్లాడి రైతులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు నర్సీపట్నం లో స్పీకర్ ని కలిసి ఉత్తరాంధ్ర లోని జిల్లాల వారీగా రైతులకు, ప్రజలకు జరిగిన నష్టాన్ని వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు అనంతరం భీశెట్టి విలేకరులతో ఉత్తరాంధ్ర లో వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, చాలా గ్రామాలు నేటికీ నీట మునిగి ఉన్నాయని అన్నదాత ఆవేదన ఊహించని స్థాయిలో ఉందని ముఖ్యం గా కౌలు రైతుల్లో తీవ్రంగా నష్ట పోయామనే ఆవేదన ఉందని,జిల్లాల వారీగా జరిగిన నష్టాల పై అంచనాలకు ప్రత్యేక బృందాలని పంపాలని,మారిన వాతావరణం కారణంగా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నను కోరామని ప్రభుత్వం తో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని భీశెట్టి బాబ్జి అన్నారు

సమన్వయంతో అన్ని స్థానాలు గెలవాలి : గంటా



భీమిలి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): కూటమి పార్టీల నాయకులు సమన్వయంతో పని చేసి మండలంలోని అన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను గెలుచుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభం అభివృద్ధికి ఈ ఎన్నికలు ముఖ్యమని తెలిపారు. మండలంలోని కురపల్లి గ్రామంలోని రిసార్ట్స్ లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మనాభం మండలం టీడీపీకి ఎప్పుడూ కంచుకోటగా ఉంటుందని, స్థానిక ఎన్నికల్లో జెడ్పీటీసీ సహా 15 ఎంపీటీసీలు గెలుచుకుని తీరాలన్నారు. అనంత పద్మనాభస్వామి ఘాట్ రోడ్డు తో పాటు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని జనంలోకి తీసుకువెళ్లాలని చెప్పారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పద్మనాభం మండలంలో ఎప్పుడూ లేని మెజారిటీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం 28 నెలల్లో విశేషమైన అభివృద్ధి చేసిన నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో అంతకు మించిన మెజారిటీలు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధినే మర్చిపోయేలా వైసీపీ విధ్వంసకర పాలన సాగిందని విమర్శించారు. పెన్షన్లు, తల్లికి వందనం పథకాల్లో లబ్ధిదారులను జగన్మోహన్ రెడ్డి నిలువునా మోసం చేశారని, వైసీపీ కంటే మెరుగైన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం అప్రతిహతంగా కొనసాగాలంటే జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా కూటమి అభ్యర్థులే ఎన్నిక కావాలని చెప్పారు. కూటమి సీట్ల సర్దుబాటులో టికెట్లు రాని ఆశావహులకు భవిష్యత్ లో న్యాయం చేస్తామని గంటా భరోసా ఇచ్చారు. ప్రచార సమయం తక్కువ ఉన్నందున సాధ్యమైనన్ని ఎక్కువ ఇళ్లు సందర్శించి ఓటర్లను కలవాలని, అన్ని స్థానాలు ఏకపక్షంగా గెలిచి రికార్డు సృష్టించాలన్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం చాలా ముఖ్యమని చెబుతూ.. ఏవైనా సమస్యలుంటే స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని సూచించారు. అభ్యర్థి విజయానికి పని చేయని వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని, వారిని ఎప్పటికీ కూటమి పార్టీల్లోకి తిరిగి తీసుకోవడం జరగదని హెచ్చరించారు. కీలకమైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పద్మనాభం జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను పరిచయం చేశారు. సమావేశంలో భీమిలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, కూటమి నాయకులు కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కె.రామరాజు, కాళ్ల నగేష్ కుమార్, కురుమిన లీలావతి, గోపీరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు తక్షణ సహాయం అందించాలి!

వరద పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌తో సమీక్షించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, నదుల్లో కొనసాగుతున్న వరద ప్రవాహంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఫోన్‌లో సమీక్షించారు. వంశధార, నాగావళి, బహుదా నదుల్లో నెలకొన్న ప్రస్తుత వరద పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితు లు, ప్రభావిత గ్రామాల్లో చేపడుతున్న సహాయక చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన చోట్ల ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన ఆహార పొట్లాలు, అత్యవసర మందులతో కూడిన వైద్య కిట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. తుఫాన్, భారీ వర్షాల ప్రభావంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, దీనివల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, వైద్య బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. జ్వరాలు, ఇతర వ్యాధుల లక్షణాలు కనిపించిన వారికి తక్షణమే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవా లన్నారు. ముఖ్యంగా బహుదా నదిలో వరద ప్రవాహం అధికంగా ఉండటంతో పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రహదారులపై వరద నీరు ప్రవహించే ప్రాంతాల్లో రాకపోకలను నియంత్రి స్తూ, ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. వరద పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకునే వరకు రెవెన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్న తిరుమల తిరుపతి హెచ్.హెచ్. గోవింద రామానుజ చిన్న జీయర్ స్వామివారు



సింహాచలం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): తిరుమల తిరుపతికి చెందిన హెచ్.హెచ్. గోవింద రామానుజ చిన్న జీయర్ స్వామివారు సింహా చలంలోని శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనర సింహ స్వామివారిని దర్శిం చుకున్నారు. ఈ సందర్భ ంగా దేవస్థానం ఆలయ కార్య నిర్వహణాధి కారి జల్లే పల్లి వెంకటరావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసా చార్యులు ఆలయ సంప్రదా యాలు, ఆచార వ్యవహారా లకు అనుగుణంగా భక్తిశ్రద్ధ లతో స్వామి వారికి స్వాగతం పలికారు. అనం తరం చిన్న జీయర్ స్వామి వారు స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు వేద మంత్రోచ్ఛారణలతో వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం దేవస్థానం తరఫున స్వామివారికి ఆలయ మర్యాదలతో స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమం ఆలయ ఆధ్యాత్మిక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.

సాంకేతిక ఆధారాలతో క్షణాల వ్యవధిలో హత్య కేసును ఛేదించిన పద్మనాభం సీఐ చంద్ర మౌళి



విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పద్మనాభం పోలీస్ స్టేషన్ పరిధిలో రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అప్పలరాజు (73) అనే వృద్ధుడు, పల్లంటి చిన్నారావు అనే వ్యక్తికి చెందిన కర్రల మిల్లులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రెడ్డిపల్లి రాము అనే వ్యక్తి కర్రల మిల్లు సమీపంలో ఒంటరిగా నివసిస్తు న్నాడు. అతను మద్యానికి బానిసై, మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వాలని అప్పలరాజును, మిల్లు యజమాని చిన్నారావును తరచూ అడుగుతూ వేధించేవాడు. అయితే అప్పలరాజు డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో పాటు, మిల్లు వైపు రావద్దని గట్టిగా హెచ్చరించడంతో అప్పలరాజుపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యం లో నిన్న రాత్రి సమయంలో అప్పలరాజుపై కర్రతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. హత్య ఘటన సమాచారం అందిన వెంటనే పద్మనాభం సీఐ చంద్ర మౌళి, నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చొరవ తీసుకొని దర్యాప్తును వేగవంతం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ టీమ్ సహకారంతో పాటు అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, సమన్వయంతో దర్యాప్తు చేపట్టి నిందితుడి ఆచూకీని అతి తక్కువ సమయంలో రేవిడి వద్ద గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని న్యాయ స్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. సాంకేతిక ఆధారాలతో పాటు వివిధ దర్యాప్తు పద్ధతులను సమర్థవంతంగా వినియోగించుకొని హత్య కేసును అతి తక్కువ సమయంలో ఛేదించడం పోలీసుల వృత్తి నైపుణ్యానికి, అంకితభావానికి, సమన్వయానికి నిదర్శనంగా నిలిచింది. DCP-1 1Ch. మణికంఠ , ACP North1S. అప్పలరాజు పర్యవేక్షణలో ఈ హత్య కేసును అత్యంత వేగంగా ఛేదించడంలో చొరవ చూపిన పద్మనాభం సీఐ చంద్ర మౌళి మరియు పోలీసు సిబ్బంది పనితీరును విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే విధమైన అంకితభావం, వృత్తి నైపుణ్యం మరియు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ విశాఖపట్నం పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారు.

పెందుర్తి పోలీసుల భారీ రూట్ మార్చ్ కవాతు!

పెందుర్తి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ప్రచార గడువు ముగిసిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల నియమావళి అమలు, శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిం చేందుకు ఈ రోజు పెందుర్తి పోలీసులు భారీ రూట్ మార్చ్ కవాతు నిర్వహించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి పురుషోత్తపురం వరకు ఈ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎలాంటి ఎన్నికల ఉల్లంఘనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పని సరిగా పాటించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు ప్రజలందరూ సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ప్రజల సహకారంతో ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణే పెందుర్తి పోలీసుల లక్ష్యం.



ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించాం : మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం. చెప్పిన ప్రతి పనినీ పూర్తి చేస్తూ పాలన సాగిస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అభివృద్ధి పాలనకు మద్దతు తెలపాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. మచిలీపట్నం మున్సిపాలిటీ పరిధిలో మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదాతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే కృతనిశ్చయంతో పని చేస్తుంటే.. వైసీపీ పాలకులు మాత్రం చొక్కాలు మడతపెడతాం, నరుకుతాం, రప్పా రప్పా అంటూ గొడ్డలి సంస్కృతి విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రం కోసం పని చేసేదెవరో.. రాష్ట్రాన్ని రక్తసిక్తం చేయాలనుకుంటున్నదెవరో ప్రజలు గుర్తించి ఎన్నికల్లో ఓటు వేయాలి. మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యమిచ్చి పూర్తి చేస్తున్నాం. 2014-19 మధ్య మచిలీపట్నంలో చేసిన అభివృద్ధి తప్ప.. వైసీపీ పాలనలో వీసమెత్తు అభివృద్ధి కూడా జరగలేదు. మళ్లీ ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతమయ్యాయి. 15వ ఆర్థిక సంఘం, సాస్కి, హమ్ నిధులు తీసుకొచ్చి మచిలీపట్నంలో సుమారు రూ.954 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశాం. మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు కట్టుబడి పని చేస్తున్నాం. గత ఐదు సంవత్సరాలు మున్సిపాలిటీని ఏలిన వైసీపీ నేతలు కనీసం బడ్జెట్ కూడా పెట్టలేదు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సరైన భవనం కూడా కట్టలేక పోయారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.7.60 కోట్ల వ్యయంతో మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం ప్రారంభించాం. మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేశాం. పెట్టుబడులు తీసు కొస్తున్నాం. బందరు పోర్టుకు అనుబంధంగా రూ.8000 కోట్ల వ్యయంతో గోవా షిప్ యార్డు కంపెనీ ఏర్పాటు చేస్తున్నాం. 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. మచిలీపట్నం నియోజకవర్గం బాగుపడేది కూటమి ప్రభుత్వంలోనే. కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా మాత్రమే రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉంటాయి. అభివృద్ధి శాశ్వతంగా కొనసాగు తుంది. రప్పా రప్పా అంటూ మాట్లాడే రౌడీ బ్యాచ్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు రేపు ఓటుతో బుద్ధి చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బూరగడ్డ వేదవ్యాస్, కొనకళ్ల జగన్నాధ రావు, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

మధురవాడ లో విస్తృత తనిఖీలు



మధురవాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో మధురవాడ జోన్ పరిధిలోని 6, 7, 8, 9, 10, 11 వార్డులు, శివారు కాలనీల్లో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరం చేసింది. ఆర్ఐ ఈశ్వరరావు, ఏఎస్ఐ రామారావు సిబ్బందితో కలిసి శివశక్తి నగర్ రోడ్డు, ఉడా రోడ్డు, పీఎం పాలెం లాస్ట్ బస్ స్టాప్, సాయిప్రియ లేఅవుట్, మారికవలస కాలనీ తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు, కార్గో వెహికల్స్‌ను ఆపి పరిశీలిస్తున్నారు.

సాక్షి రిపోర్టర్ సుబ్బారెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): సంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన సాక్షి రిపోర్టర్ సుబ్బారెడ్డిపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు కె. రాము, ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, కోశాధికారి పరుశురాం, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్. రామచంద్రరావు డిమాండ్ చేశారు. విడుదల చేసిన ప్రకటనలో ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇంట్లో నిద్రిస్తున్న సుబ్బారెడ్డిపై అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరచడం దుర్మార్గమైన చర్య అన్నారు. . ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. దాడికి పాల్పడిన వారితో పాటు, దాడి చేయించిన వారిని కూడా గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాడులతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయాలని చూడటం అందోళనకరమని వారు అన్నారు. జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నవంబర్ 1వ తేదీన మాంసం దుకాణాలకు సెలవు

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని మాంసం దుఖాణా లకు నేడు అనగా నవంబర్ 1వ తేదీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నగరంలో మాంసం, చికెన్, చేపలు మొదలైన దుఖాణాలకు, జంతు వధశాలలకు సెలవు ప్రకటించడమైనదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. నవంబర్ 1వ తేదీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నగరంలో వేటమాసం, కోడి మాంసం, చేపలు, రొయ్యలు మొదలైన దుఖాణాలకు, జంతు వధశాలలకు సెలవు ప్రకటించడమైనందున సంబంధిత దుఖాణాలు, జంతు వధశాలలు మూసివేయాలని, అతిక్రమించి మాంసపు దుకాణదారులు ఎవరైనా తమ దుకాణాలను తెరిచి మాంసము, చేపలు, రొయ్యలు విక్రయించిన, జంతు వధ శాలలు తెరిచిన యెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగునని జీవీఎంసీ కమిషనర్ తెలియజేశారు.

ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

- దిశానిర్దేశం చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా
- వీసీలో వర్చువల్ గా హాజరై వివరాలను వెల్లడించిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



విశాఖపట్టణం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియపై ఓటర్లలో పూర్తి విశ్వాసం కలిగించేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి డా.ఎ. మల్లికార్జున, ఐజీ రాజ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ చంద్ర పునేఠా మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల్లో క్యూ మేనేజ్‌మెంట్, సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని, పోలింగ్ సిబ్బంది రవాణాకు వాహనాలు, రూట్ చార్టులను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా తనిఖీ చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. శనివారం ఉదయం 10 గంటలలోపు అన్ని పోలింగ్ కేంద్రాల భౌతిక తనిఖీలు పూర్తి చేసి లోపాలను సరిచేయాలని ఆదేశించారు. విశాఖపట్టణం జిల్లాలో జీవీఎంసీ, పరిషత్ ఎన్నికల నిర్వహణారకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, పోలీసు, జీవీఎంసీ, ఇతర శాఖల అధికారులతో సమస్వయం చేసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తూ.చ. పాటిస్తామని పేర్కొన్నారు. వీసీలో కలెక్టర్ ఛాంబర్ నుంచి ఏడీసీలు రమణ మూర్తి, వర్మ, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఎన్నికల బందోబస్తుపై పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం



గాజువాక , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 1వ తేదీన జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో రూట్ మొబైల్ అధికారులు, స్టాటిక్ బందోబస్తు సిబ్బందితో గాజువాక సీఐ వాసు నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సీఐ వాసు నాయుడు సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రూట్ మొబైల్ అధికారులు తమ పరిధిలో నిరంతరం పర్యటిస్తూ పరిస్థితులను పర్యవేక్షించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్టాటిక్ బందోబస్తు సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ, పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణను పాటించాలని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులకు కేటాయించిన ప్రదేశాల్లో ముందుగానే చేరుకోవాలని, విధుల నిర్వహణలో సమన్వయంతో వ్యవహరించాలని సీఐ వాసు నాయుడు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

కాకినాడ మేయర్ పీఠాన్ని చేనేత వర్గానికి కేటాయించాలి

కూటమి ప్రభుత్వానికి పద్మశాలీ, చేనేత సంఘాల విజ్ఞప్తి



కాకినాడ , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): రానున్న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పదవిని చేనేత సామాజిక వర్గానికి కేటాయించాలని కాకినాడ పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం, చేనేత కులాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్పొరేషన్ మేయర్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ అయిన నేపథ్యంలో, కూటమి తరఫున విద్యావంతు రాలైన జాగు హారికకు ఆ అవకాశమిచ్చి చేనేతలను గౌరవించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు సంఘం నేతలు మాట్లాడారు. రాష్ట్రంలోని దాదాపు 40 నుంచి 45 నియోజకవర్గాల్లో 18 చేనేత సామాజిక వర్గాలు గణనీయమైన జనాభాతో గెలుపోటములను శాసించే స్థాయిలో ఉన్నాయని నేతలు తెలిపారు. ముఖ్యంగా పిఠాపురం, మంగళగిరి, ధర్మవరం, ఎమ్మిగనూరు, వెంకటగిరి, చీరాల, మదనపల్లె, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయాలకు చేనేత వర్గం సంపూర్ణంగా మద్దతు తెలిపిందని గుర్తుచేశారు. పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కాకినాడలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ విజయాల్లో చేనేతల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా 11 నియోజకవర్గాల్లో గెలిచే సత్తా ఉన్నప్పటికీ, ఇటీవల జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో రొటేషన్ పద్ధతి మరియు రిజర్వేషన్ల కారణంగా చేనేత వర్గానికి తగిన ప్రాతినిధ్యం దక్కలేదని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏళ్ల క్రితం బీరక చంద్రశేఖర్ చైర్మన్‌గా పనిచేసిన తర్వాత ఇప్పటివరకు కాకినాడలో తమ వర్గానికి అవకాశం రాలేదన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీ మేరకు కాకినాడ మేయర్ స్థానాన్ని జనసేన ద్వారా జాగు హారికకు కేటాయించి న్యాయం చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను కోరారు. ఈ విషయంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

31 నుండి గీతంలో సౌత్ జోన్ ఇంటర్

యూనివర్సిటీ పురుషుల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు



భీమునిపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీ 2026 అక్టోబర్ 31 నుండి నవంబర్ 2 వరకు 'ఏ ఐ యూ సౌత్ జోన్ ఇంటర్-యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ (పురుషుల) ఛాంపియన్‌షిప్ 2026 -27' ను నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేసింది. అక్టోబర్ 30న నిర్వహించిన విలేకరుల సమావేశంలో గీతం క్యాంపస్ లైఫ్ అసిస్టెంట్ డీన్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్ కార్తీక్ ఈ వివరాలను వెల్లడించారు. దక్షిణ భారతదేశం నలుమూలల నుండి 96 విశ్వవిద్యాలయాల జట్లు ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో పాల్గొనడానికి నమోదు చేసుకున్నాయని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా వేడుకలో దాదాపు 480 మంది క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు మరియు టీమ్ మేనేజర్లు పాల్గొంటారని, విశ్వవిద్యాలయాల స్థాయిలోని అత్యుత్తమ టేబుల్ టెన్నిస్ ప్రతిభావంతులు ఇందులో హోరాహోరీగా పోటీపడతారని పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొంటున్న జట్లు దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. వీటిలో కర్ణాటక నుండి 33, తమిళనాడు నుండి 25, ఆంధ్రప్రదేశ్ నుండి 18, కేరళ నుండి 11, తెలంగాణ నుండి 8 మరియు పుదుచ్చేరి నుండి 1 జట్టు ఉన్నాయి. ఈ టోర్నమెంట్‌లో అగ్రస్థానంలో నిలిచే తొలి నాలుగు జట్లైన ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, జైన్ విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం మరియు వేల్స్ విశ్వవిద్యాలయాలు 2027 జనవరి 6 నుండి పంజాబ్‌లోని చిత్కారా విశ్వవిద్యాలయం నిర్వహించనున్న 'ఆల్ ఇండియా ఇంటర్-యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్'కు నేరుగా అర్హత సాధిస్తాయి. దీనికి తోడు పోటీపడుతున్న జట్లు తగిన అర్హత ప్రమాణాల ఆధారంగా ప్రతిష్టాత్మక 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్'కు ఎంపికయ్యే అవకాశం పొందుతాయి. ఈ ఛాంపియన్‌షిప్‌ను వృత్తిపరంగా, సజావుగా నిర్వహించేందుకు అంతర్జాతీయ బ్లూ బ్యాడ్జ్ అంపైర్ డి. వి. ఎస్. వై. శర్మ ను చీఫ్ రెఫరీగా, కే. కన్నా బాబును రెఫరీగా మరియు 12 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి అర్హత కలిగిన అంపైర్లను నియమించారు. విచ్చేసే అన్ని జట్లకు అనువుగా పోటీ ప్రాంగణాలు, వసతి మరియు ఇతర అవసరమైన సహాయక సేవలను గీతం క్రీడా విభాగం సమగ్రంగా ఏర్పాటు చేస్తోంది. ఇటువంటి భారీ స్థాయి టోర్నమెంట్‌ను నిర్వహించడం ద్వారా టేబుల్ టెన్నిస్ క్రీడను ప్రోత్సహిం చడానికి, యువ క్రీడాకారుల లోని నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం నిరంతరం కట్టుబడి ఉంది. ఈ విలేకరుల సమావేశంలో గీతం స్పోర్ట్స్ వింగ్ సీనియర్ మేనేజర్ కోట వి. తపస్వి మరియు ఏ ఐ యూ పరిశీలకుడు పాల్గొన్నారు.

మండలం అభివృద్ధి చెందాలంటే కూటమిని గెలిపించాలి



కవిటి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీపీ ప్రతినిధి సిపాన వెంకటరమణ అన్నారు. మండలం మండలంలోని బోరివెంక 1. తెదేపా ఎంపీటీసీ అభ్యర్థి ప్రసాద్ ఎన్నికల ప్రచారంలో సిపాన వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అంది ంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు విజయ్ . లొల్ల శ్రీను తోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు

జనసమూహాల మధ్య దూసుకుపోతున్న కూటమి ప్రచార రథం



దేవరాపల్లి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): జనసమూహాల మధ్య కూటమి ప్రచారం హోరెత్తుతోంది. మారేపల్లి సెగ్మెంట్ లో ఇంటింటికీ కూటమి సంక్షేమం అంటూ సాగుతున్న ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. రామూర్తి నాయుడు సారథ్యంలో 29/10/26న మారేపల్లిలో, నేడు 30/10/26 ఉదయం 7 గంటలకు తారువ రాజ కాలనీలో జరిగిన ప్రచారం జనసంద్రంగా మారింది.ప్రతి ఇంటి నుంచి మహిళలు, యువత, పెద్దలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి కూటమి నేతలకు మద్దతు తెలుపుతున్నారు. పింఛన్లు, ఉచిత బస్సు, 3 సిలిండర్లు, రోడ్లు, తాగునీరు వంటి అభివృద్ధి పనులే తమ ఓటుకు కొలమానమని ప్రజలు చెబుతున్నారు.జడ్పీటీసీ అభ్యర్థి కిలపర్తి రాజేశ్వరి , ఎంపీటీసీ అభ్యర్థి అల్లు సరోజ (ఇద్దరూ బ్యాలెట్ నెం.1, సైకిల్ గుర్తు) కు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాయకులు కోరారు. మారేపల్లి, తారువ, చేనులుపాలెం టీడీపీ, జనసేన శ్రేణులు జనసమూహాల మధ్య ప్రచారాన్ని విజయవంతం చేస్తున్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిశాంతి టి



పాడేరు , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు , జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (మరియు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నద్ధత, ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంతి టి. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటరు జాబితాల సిద్ధం, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణ, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలీసు బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్షించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, లైటింగ్, మరుగుదొడ్లు, దివ్యాంగులకు అనుకూలమైన ర్యాంపులు తదితర కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ సిబ్బంది రవాణా, ఎన్నికల సామగ్రి భద్రత, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను సమీక్షించారు.

మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూడా అవసరమైన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. వార్డుల వారీగా ఓటరు జాబితాల సిద్ధం, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిజర్వేషన్లకు సంబంధించిన ప్రక్రియ, ఎన్నికల సామగ్రి, పట్టణ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

పోలీసు బందోబస్తు, శాంతిభద్రతలు

ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది మోహరింపు, నిరంతర గస్తీ, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, ప్రలోభాలకు గురిచేయడం వంటి చర్యలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలు అందించే చర్యలను అరికట్టాలని సూచించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదుల స్వీకరణ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

మీడియా పర్యవేక్షణ -- MCMC

ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలపై ఎన్నికలకు సంబంధించిన ప్రచారాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పెయిడ్ న్యూస్, అనధికార రాజకీయ ప్రకటనలు, ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన ప్రచారాలను గుర్తించి, సంబంధిత ఆధారాలతో నివేదికలు సిద్ధం చేయాలని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (వీజవీజ) అధికారులకు సూచించారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులు, పోలింగ్ ప్రక్రియ, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సుల వినియోగం, ఎన్నికల నియమ నిబంధనలపై సమగ్ర శిక్షణ అందించాలని సూచించారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాను కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు రహదారి సౌకర్యం, విద్యుత్ సరఫరా, తాగునీరు, సమాచార వ్యవస్థలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాలు, అంతర్గత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది, ఓటర్లు సురక్షితంగా చేరుకునేలా ప్రత్యామ్నాయ రవాణా, అవసరమైన ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు.

కంట్రోల్ రూములు – నిరంతర పర్యవేక్షణ

జిల్లా, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూములు సమర్థవంతంగా పనిచేయాలని, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలపై తక్షణ స్పందన ఉండాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు, మండల ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు ఎన్నికల సన్నద్ధత నివేదికలను సమర్పించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలు

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీమతి నిశాంతి టి. మాట్లాడుతూ, జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు రవాణా సౌకర్యం, భద్రత, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించాలని, ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, మండల ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు
నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న కౌంటింగ్

నగర పోలీస్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్



విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం కమిషనరేట్ నందు గల కాన్ఫరెన్స్ హాల్ నందు నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి సమావేశమై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నగర వ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న మొత్తం అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు సీపీ ప్రతీ స్టేషన్ యొక్క సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఆయా స్టేషన్లకు సిబ్బంది సరిపడా ఉన్నదీ, ఏదైనా స్టేషన్ కు అదనముగా సిబ్బంది అవసరం ఉన్నదీ ఆరా తీశారు, ఎన్నికలు విధులు నిర్వహిస్తున్న అధికారులు మరియు సిబ్బంది విధులను సమీక్షించారు. ప్రతీ స్టేషన్ పరిధిలో ఉండే స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులను, ఆయా స్టేషన్ పరిధిలో గల పూర్వానుభవాన్ని పరిగణలోనికి తీసుకోవాలని సూచించారు. ప్రతీ స్టేషన్ పరిధిలో ఫోర్ వీలర్స్ తో పాటుగా ఖచ్చితముగా తగు ద్విచక్ర వాహనాలతో నిరంతర పెట్రోలింగ్ చేయాలనీ ఆదేశించారు. నగరంలోని అన్ని స్టేషన్ల పరిధిలో గల సమస్యాత్మక ప్రాంతాలలో డ్రోన్ ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటుకు, సంబంధిత అధికారులుతో చర్చించి, తగు చర్యలు తీసుకోవడం జరిగింది. పోలింగ్ అనంతరం పోలింగ్ బూత్ ల నుండి బ్యాలెట్ బాక్సులను, తగు ఎస్కార్టులతో ట్రాఫిక్ ను సమన్వయపరుచుకుంటూ స్ట్రాంగ్ రూమ్ లు చేరుకునేందుకు ఏ.డి.సి.పి(ట్రాఫిక్) ఆధ్వర్యంలో తగు రూట్లను సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగినది. ఓటర్లకు నగదు, మద్యం, ఇతర ప్రలోభాలు పంపిణీ చేయడం, ఓటర్లను బెదిరించడం, దొంగ ఓట్లు వేయడం, బూత్ ఆక్రమణకు పాల్పడడం, ఆయుధాలు తీసుకెళ్లడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు లేదా రెచ్చగొట్టే సమాచారాన్ని ప్రచారం చేయడం చట్టరీత్యా నేరం. అటువంటి చర్యలకు పాల్పడే వారిపై పార్టీలు, హోదాలతో సంబంధం లేకుండా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఓట్ల లెక్కింపు రోజున పోలీసుల అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిర్వహించరాదు. విశాఖ నగర పరిధిలోని ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పోలింగ్ కేంద్రాలకు వచ్చి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలు అందరూ పోలీసులకు, ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో బెదిరింపులు, ప్రలోభాలు లేదా శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలు ఎదురైతే నగర పోలీసు కమిషనర్ పర్సనల్ ఫోన్ నెంబర్ 7995095799 కు, నగర పోలీసు కంట్రోల్ రూమ్ 089125 65454 లేదా డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

66 లక్షలు విలువైన నకిలీ కరెన్సీ
జిరాక్స్ కాపీలు, డమ్మీ పిస్టల్ స్వాధీనం..నలుగురు అరెస్ట్



విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): సాధారణ ఎన్నికలు--2026 నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా, 30-10-2026 తేదీన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీలలో మహారాణిపేట పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా, జగదాంబ జంక్షన్ సమీపంలోని V-Star హోటల్‌లో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు SI A. మనోజ్ కుమార్ నేతృత్వంలోని పోలీసు బృందం హోటల్‌లోని రూమ్ నంబర్ 105లో తనిఖీలు నిర్వహించి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. 1. పాంగి కొండబాబు, తండ్రి: కేసన్న, వయస్సు: 26, కులం: ఎస్టీ (కొంధు), నివాసం: డోమలజోరు గ్రామం, అరకు మండలం,ూూ= జిల్లా. 2. బేవర సాయి, తండ్రి: గోవింద్, వయస్సు: 25, కులం: కాపు, నివాసం: మామిడిపల్లి గ్రామం, సాలూరు మండలం, పార్వతీపురం మన్యం జిల్లా. 3. ఇజ్జవరపు దుర్గాప్రసాద్, తండ్రి: భాస్కరరావు, వయస్సు: 24, కులం: కాపు, నివాసం: పెద్దవీధి, సాలూరు గ్రామం మరియు మండలం, పార్వతీపురం మన్యం జిల్లా. 4. వెలగడ దినేష్, తండ్రి: జంపయ్య, వయస్సు: 23, కులం: ఎస్సీ, నివాసం: ఎస్. పెద్దవలస గ్రామం, మక్కువ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా. హోటల్ గదిలో తనిఖీ చేయగా, ఒక లగేజి బ్యాగ్ లో 500 రూపాయల నోట్లకు సంబంధించిన 66 కలర్ జిరాక్స్ కాపీలు చొప్పున మొత్తం 200 కట్టలు, వాటి ముఖ విలువ రూ. 66,00,000/- (అరవై ఆరు లక్షలు) కలర్ జిరాక్స్ కాపీలు, అలాగే వేరొక బ్యాగ్ లో ఒక డమ్మీ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అందరూ ఒకరికొకరు Instagram ద్వారా సుమారు 3 నెలల క్రితం పరిచయం అయ్యారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు వినోద్, వంశీ, చందు కూడా వీరితో పాటు ఈ నేరంలో పాత్రధారులు. ఇందులో భాగంగా చందు అనే వాడు కలర్ జిరాక్స్ కరెన్సీ నోట్లను తీసుకురావడం, ఫోటోల ద్వారా డబ్బులు మార్పిడి చేసుకునే వ్యక్తులను గుర్తించడం, పరిసరాలను గమనించడం మరియు నోట్ల మార్పిడికి సహకరించడం వంటి పనులు చేస్తున్నట్లు తెలిసింది. వీరు ఇలాంటి లావాదేవీలను ఇంతకు ముందు విజయనగరం, విశాఖపట్నంలో కూడా నిర్వహించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై http://Cr.no. 141/2026 U/s 179, 180, 318(4) R/w 62, 3(5) BNS కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.జగదాంబ V-Star హోటల్‌లో మహారాణిపేట పోలీసుల దాడి – 66 లక్షల నకిలీ కరెన్సీ జిరాక్స్ నోట్లు, డమ్మీ పిస్టల్ స్వాధీనం – నలుగురు అరెస్ట్ - Instagram పరిచయంతో మోసాలకు పాల్పడుతున్న ముఠా అని పోలీసుల వెల్లడి - GVMC ఎన్నికల తనిఖీల్లో బయటపడ్డ ముఠా.

పైడిగూడెంలో 30 కొండరెడ్డి కుటుంబాలకు అన్నదానం



కూనవరం , అక్టోబర్ 30 (మనం న్యూస్): ఆకలితో అలమటించే నిరుపే దల కడుపు నింపడమే మానవత్వా నికి నిజమైన ప్రతిరూపమని, ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలవడమే సమాజానికి చేసే గొప్ప సేవ అని ఏ పీ డబ్ల్యు జే ఎఫ్ ,జిల్లా ఉపాధ్యక్షుడు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి ఎస్.కె. ఇంతియాజ్ పేర్కొన్నారు. పోలవరం జిల్లా కూనవరం మండలం పైడిగూడెం గ్రామంలో ఏబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 కొండరెడ్డి కుటుంబాలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్.కె. ఇంతియాజ్ మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చేందుకు ఏబీ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ, సేవా భావంతో ముందుకు సాగడం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఫౌండేషన్ చైర్మన్ కుంజా అనిల్ ఆదేశాలతో.. ఈరోజు ఈ కార్యక్రమం జరిగి ంది “కడుపు నిండిన వారికి ఆకలి విలువ తెలియదు.. ఆకలి వేసిన వాడికే అన్నం విలువ తెలుస్తుంది” అనే నానుడిని స్ఫూర్తిగా తీసుకుని ఏబీ ఫౌండేషన్‌ను ప్రారం భించా మన్నారు. నిరుపేదల కష్టాల్లో భాగస్వాములై, వారికి చేతనైనంత సహాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చిన్నపాటి సహాయం సైతం పేద కుటుంబాలకు ఎంతో ఊరట నిస్తుందని, భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కిరణ్ బాబు, తోడం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మేయర్ అభ్యర్థిగా నమ్మి భవానీ

విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): భారత్ చైతన్య యువజన పార్టీ (బీసీవై పార్టీ) తరపున విశాఖపట్నం మహానగర పాలక సంస్థ (జీపీఎంసీ) మేయర్ అభ్యర్థిగా నమ్మి భవానీ (ఎం.బి.ఎ.)ను పార్టీ ప్రకటించింది. విశాఖ అభివృద్ధి, మెరుగైన పట్టణ సేవలు, ప్రజా సంక్షేమం లక్ష్యంగా 18 అంశాల మేనిఫెస్టోతో ప్రజలా ముందుకు వస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. యువత ఆలోచనలు, సరికొత్త విజన్, చిత్తశుద్ధి కలిటేన పాలన ద్వారా విశాఖను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దాలని రెండు నమ్మి భవానీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెర్పొన్నారు. నగరంలోని మౌలిక వసతులు, పరిశుభ్రత, పారిశుధ్యం, రవాణా, తాగునీరు, ఆరోగ్య సేవలు, విద్యా సదుపా యాలు, మహిళల భద్రత, యువతకు అవకాశాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన 18 అంశాల మేనిఫెస్టోను పార్టీ ప్రచారంలో ప్రస్తావించింది. నగరంలో నిరంతరం ప్రజలతో మమేకమై, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నమ్మి భవానీ తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం..ఒక వ్యక్తి అదుపులోకి



గాజువాక , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): గాజువాక సీఐ వాసు నాయుడు ఆదేశాల మేరకు, ఎస్సై జగదీష్ అక్కిరెడ్డిపాలెం వాటర్ ప్లాంట్ సమీపంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న అమరని జగదీశ్వరరావు (38) వద్ద నుంచి Bonnie Whisky 180 మీ బాటిళ్లు 40 (మొత్తం 7.2 లీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా ఏసీబీ అవగాహన సదస్సు



విశాఖపట్నం , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): సమాజంలో అవినీతిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏసీబీ అడిషనల్ ఎస్పీ SR హర్షిత , ఏసీబీ DSP రమణ మూర్తి మరియు ఏసీబీ DSP l పృథ్వి తేజ తెలిపినారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ‘విజిలెన్స్ వారోత్సవాల’లో భాగంగా, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక అవగాహన కార్యరామం ను KGH నందు డాక్టర్స్ , నర్సులు మరియు ఇతర సిబ్బంది నందు నిర్వహించినారు . ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా ప్రజలు భయపడకుండా వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని సూచించారు. సమాజంలో అవినీతి రహిత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రజలలో చైతన్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ACB అడిషనల్ ఎస్పీ SR హర్షిత మాట్లాడుతూ, ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలి అని అలాగే వాట్సాప్ నెంబర్, ఈమెయిల్ ద్వారా తెలియ పరచవచ్చు అని తెలియచేసినారు. ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్: 1064 వాట్సాప్ నెంబర్: 94404 40057 ఈమెయిల్: complaints-acb@ap.gov.in ఫోన్ నెంబర్: 0866-24 28770 ప్రజలు ఈ నెంబర్లను ఉపయోగిం చుకుని అవినీతిపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని అన్నారు . ఈ కార్యక్రమంలో ఏసీబీ Addl SP SR హర్షిత, మరియు KGH Superintendent I.Vani మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ దెబ్బతిన్న కొబ్బరి తోటల పరిశీలన

కవిటి , అక్టోబర్ 31 (గ్లోబల్ వార్త): మండలం లో ‘ఆర్నబ్’ తుఫా న్ ప్రభా వంతో దెబ్బతిన్న కొబ్బరి తోటలను ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు. పెద్దపేట ఉద్యాన శాస్త్రవేత్త రాజశేఖర్, కవిటి ఉద్యానాధికారి పోలాకి మాధ వీలత ఆధ్వర్యంలో అధి కారులు బొరివంక, బెజ్జిపు ట్టుగ, జగతి తదితర గ్రామా ల్లో పర్యటించి, నష్టాన్ని అంచనా వేస్తూ రైతులకు పలు సూచనలు చేశారు. నేలకూలిన చెట్లను వెంటనే తోటల నుంచి తొలగిం చాలి. లేనివక్షంలో కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.



తోటల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపాలి. ఐదేళ్లలోపు వాలిపోయిన మొక్కలను నిటారుగా నిలబెట్టి ఊతం ఇచ్చి, మొదళ్ల వద్ద మట్టిని ఎగదోయాలి. మొవ్వు కుళ్లు సోకిన భాగాలను కాల్చివేసి, అక్కడ 10 శాతం బోర్డో పేస్టు పూసి పాలిథిన్ కవరుతో కప్పాలి. కాయ కుళ్లు నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి. తోటలు తేరుకున్నాక ఐదేళ్లు దాటిన ప్రతి చెట్టుకు 500 గ్రాముల యూరియా, కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలని అధికారులు సూచించారు.

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది : జగన్

ఒకటి తరువాయి

సమాచారం. ఆమెను కాపాడబోయిన మరో విద్యార్థిని కూడా తీవ్రంగా గాయపడింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో, వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. మరోవైపు, ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె కోలుకునే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య బృందాన్ని ఆదేశించానని తెలిపారు. "ఈ ఘాతుకానికి పాల్పడిన మృగాడిని పట్టుకుని, చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీసులను ఆదేశించాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం ఆయన బాధితురాలి తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి కూడా ఆయన ఆరా తీశారు. ఈ ఘటనను నారా లోకేశ్ కూడా తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పోలీసులు విస్తృత స్థాయి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

జగన్ ఆస్తుల కేసు విచారణ ముమ్మరం.. 45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తి

వైసీపీ అధినేత జగన్ ఆస్తుల కేసుల విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ కేసుల విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఇండియా సిమెంట్స్‌కు సంబంధించిన ఛార్జిషీట్‌లో దాఖలైన డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు ముగిశాయి. అనంతరం, భారతీ సిమెంట్స్ కేసుకు సంబంధించిన పిటిషన్లపై విచారణను న్యాయస్థానం ప్రారంభించింది. దశాబ్ద కాలంగా ఈ కేసులు విచారణ దశలోనే నిలిచిపోయాయని, వీటిని వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో విచారణ ప్రక్రియ వేగమందుకుంది. హైకోర్టు ఆదేశాలతో సీబీఐ, ఈడీ కేసులపై న్యాయస్థానం రోజువారీ విచారణ చేపడుతోంది. ఇప్పటివరకు ఆరు సీబీఐ ఛార్జిషీట్లకు సంబంధించి మొత్తం 45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది. జగన్‌తో పాటు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, అయోధ్యరామిరెడ్డి వంటి పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. విచారణ పూర్తయిన ఈ 45 డిశ్చార్జి పిటిషన్లపై సీబీఐ కోర్టు ఒకేసారి తన ఆదేశాలను వెలువరించనుంది. దీంతో ఈ కేసుల భవిష్యత్తుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఇస్రో శాస్త్రవేత్తలకు జగన్ అభినందనలు

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ను విజయవంతంగా ప్రయోగించి ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్షలో ప్రవేశపెట్టింది. ఇస్రో ప్రయోగం విజయవంతం కావడంపై వైసీపీ అధినేత జగన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ... "ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు హృదయపూర్వక అభినందనలు. స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్' బలోపేతంలో ఈ ప్రయోగం కీలక మైలురాయి. అత్యాధునిక అంతరిక్ష సాంకేతికతలో దేశ స్వావలంబనను మరింత బలోపేతం చేసే విజయం ఇది" అని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు కీలక సేవలు అందించడంలో ఈ ఉపగ్రహం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని జగన్ అభిప్రాయపడ్డారు. "ఇస్రో శాస్త్రవేత్తల అంకితభావం, మేధస్సు, నిరంతర కృషి దేశానికే గర్వకారణం" అని ఆయన ప్రశంసించారు. నిన్న రాత్రి శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ను ప్రయోగించారు. ఎన్‌వీఎస్-03 ఉపగ్రహంతో భారతదేశ నావిగేషన్ వ్యవస్థ మరింత పటిష్ఠం కానుంది.

దేశాన్ని కాపాడిన దార్శనికుడు సర్దార్ పటేల్ : నరేంద్ర మోదీ

ఒకటి తరువాయి

మహా సముద్రం వరకు దేశ భద్రతకు బలమైన పునాది పడిందని చెప్పారు. సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో శనివారం నిర్వహించిన 'రాష్ట్రీయ ఏక్తా దివస్' వేడుకల్లో ప్రధాని ప్రసంగించారు. సర్దార్ పటేల్ భారతదేశాన్ని కేవలం భౌగోళికంగా ఏకం చేయలేదని, ప్రజల మధ్య భావోద్వేగ బంధాన్ని కూడా బలపరిచారని మోదీ కొనియాడారు. స్వాతంత్ర్యం తర్వాత దేశం ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించడంలో ఆయన నాయకత్వం ఎంతో కీలకమైందన్నారు. నేడు మనం చూస్తున్న భారతదేశ నిర్మాణంలో పటేల్ కృషి మరువలేనిదని పేర్కొన్నారు. భారతదేశంలోని భిన్నత్వాన్ని పటేల్ ఎప్పుడూ అడ్డంకిగా చూడలేదని ప్రధాని అన్నారు. దేశ సంస్కృతి, నాగరికత, ప్రజల జీవన విధానంపై ఆయనకు పూర్తి అవగాహన ఉండేదని చెప్పారు. విభిన్న భాషలు, సంప్రదాయాలు, ప్రాంతాలు ఉన్నప్పటికీ భారతీయులందరినీ కలిపి ఉంచేది ఐక్యతేనని వివరించారు. వేల ఏళ్లుగా ఇదే స్ఫూర్తితో భారతీయులు కలిసి జీవిస్తున్నారని, అభివృద్ధి వైపు సాగుతున్నారని తెలిపారు.

స్వాతంత్ర్యానికి దిశ చూపేది గణతంత్రం

స్వాతంత్ర్యం, గణతంత్రం, జాతీయ ఐక్యత మధ్య ఉన్న సంబంధాన్ని మోదీ వివరించారు. స్వాతంత్ర్యం దేశానికి తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తుందని, గణతంత్ర వ్యవస్థ ఆ స్వేచ్ఛకు సరైన దిశ చూపుతుందని చెప్పారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరినీ బాధ్యతాయుతంగా ఉండేలా చేస్తుందని, ఐక్యత దేశం ముందుకు సాగేందుకు బలాన్నిస్తుందని పేర్కొన్నారు. అందుకే స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవంతో పాటు జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని కూడా దేశమంతా ఉత్సాహంగా జరుపుకుంటుందని వివరించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటారు. స్వాతంత్ర్యం తర్వాత దేశంలోని సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ ఈ రోజున దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రజలు దేశ సార్వభౌమత్వం, శాంతి, ఐక్యతను కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని ఈ వేడుకలు గుర్తుచేస్తాయి.

ఇండియా కూటమి మాక్ పార్లమెంట్

ఒకటి తరువాయి

నిర్వహించారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సీఈసీకి వ్యతిరేకంగా జన మహాభియోగాన్ని(పబ్లిక్ ఇంపీచ్‌మెంట్) ఖర్గే ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష పార్టీల నేతలు పాల్గొన్నారు. కాగా, జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాలు మోపిన ఆరు ప్రధాన అభియోగాలు రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. జ్ఞానేశ్ కుమార్‌పై ఆరోపణలు ఇవే..! ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసి, అధికారంలో ఉన్న బీజేపీకి రాజకీయ ప్రయోజనం కలిగించేలా వ్యవహరించారనేది ఇండియా కూటమి ప్రధాన ఆరోపణ. ఎన్నికల స్వేచ్ఛ, పారదర్శకత దెబ్బతినేలా కుట్ర జరిగిందని ఆరోపించింది. ఆరు ఆరోపణల్లో ఈ అంశం అత్యంత కీలకమైనది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) పేరుతో సుమారు 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో పార్లమెంట్‌కు తెలియకుండా, దాని పర్యవేక్షణ లేకుండా మార్పులు చేశారనేది మూడో ఆరోపణ. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన నిబంధనలను పారదర్శకత లేకుండా మార్చడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. ఎన్నికల సంఘం డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయిన ఈసీఐఎన్ఈటీ ద్వారా ఓటర్ల జాబితాలపై నియంత్రణ సాధించారని ఇండియా కూటమి ఆరోపిస్తోంది. ఓటర్ల వివరాల నిర్వహణ, వాటిపై నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో పారదర్శకత లోపించిందని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఉంటారు. అయితే కీలకమైన నిర్ణయాలు తీసుకునే సమయంలో మిగిలిన ఇద్దరు కమిషనర్లను పక్కన పెట్టి, ఏకపక్షంగా వ్యవహరించారనేది ఐదో అభియోగం. రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆరోపణ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాలకు అనుగుణంగా జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ప్రవర్తిస్తున్నారని అభియోగాలు మోపింది. అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టిన అనంతరం మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. తమకు జ్ఞానేశ్ కుమార్‌తో వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాలు లేవని, ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటర్ల జాబితాల నుంచి అర్హులైన వారి పేర్లు తొలగిపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఇండియా కూటమి నిర్వహించిన మాక్ పార్లమెంట్‌పై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది నిజమైన పార్లమెంట్ కాదని, ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయ నాటకమని విమర్శించింది. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం, బీజేపీ వర్గాలు తీవ్రంగా ఖండించాయి.

మీ కోసం చివరి వరకు నిలబడతా : సీఎం

ఒకటి తరువాయి

ఒక్కరికీ ఈ సందర్భంగా మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నాడు నా కష్టాన్ని తమ కష్టంగా భావించి స్పందించిన, మంచికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మీ ప్రేమను, అభిమానాన్ని, నమ్మకాన్ని నా జీవితాంతం నిలబెట్టుకుంటాను. నా కోసం నిలిచిన మీకోసం చివరి వరకు నిలబడతాను. మీ నమ్మకం, అభిమానం నా బలం. మీ భవిష్యత్తు నా సంకల్పం. మీ అందరి మద్దతు, సహకారం, భాగస్వామ్యంతో 2047 నాటికి తెలుగు జాతిని నంబర్ వన్‌గా చేస్తానని పునరుద్ఘాటిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

నిజం, న్యాయం గెలిచిన రోజు: లోకేశ్

రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి సీఎం చంద్రబాబు విడుదలై నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పోస్టు పెట్టారు. 'నిజం, న్యాయం గెలిచిన రోజు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఆనందించిన రోజు. గొడ్డలి పార్టీ ఐదేళ్ల పాలనలో, తప్పుడు కేసులో అక్రమంగా అరెస్టయిన దార్శనికనేత చంద్రబాబు నాయుడు గారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదలైన రోజు. 53 రోజుల పాటు గొడ్డలి పార్టీ కక్ష రాజకీయాలకు జైలులో అక్రమంగా విజనరీ లీడర్‌ను నిర్బంధించింది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా చంద్రబాబు గారికి అండగా నిలిచారు. అభిమానుల ప్రార్థనలు, ప్రజల నమ్మకంతో నిర్బంధం నుంచి నిజాయితీగా నిలువెత్తు నిలిచిన తెలుగు సంతకం నారా చంద్రబాబునాయుడు గారు. జనం జేజేల మధ్య వచ్చిన ఈరోజు జీవితంలో మర్చిపోలేని రోజు' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

నిందితుడిని వదలొద్దు : పవన్

ఒకటి తరువాయి

అనంతపురం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి గురించి ఆయన ఆరా తీశారు. దాడిలో గాయపడిన విద్యార్థినికి సాధ్యమైనంత మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అదే ఘటనలో గాయపడిన మరో విద్యార్థినికి కూడా మెరుగైన చికిత్స అందేలా చూడాలని సూచించారు. బాధితురాలి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. ఈ దారుణ ఘటనపై తక్షణమే స్పందించి, కఠినమైన చర్యలకు ఉపక్రమించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.

ఏపీకి మరో తుపాను గండం

ఒకటి తరువాయి

ఉదయం నెల్లూరు, నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 120 కిలో మీటర్ల వేగాన్ని కూడా తాకొచ్చని హెచ్చరించింది. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్ నికోబార్ దీవులకు సమీపంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వాయుగుండం, గత 6 గంటల్లో గంటకు 30 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఈ (అక్టోబర్ 31) అర్ధరాత్రికి ఇది తీవ్ర వాయుగుండంగా, రేపటికి (నవంబర్ 1న) తుపానుగా, నవంబర్ 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 5:30 గంటల సమయానికి ఈ వాయుగుండం చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 960 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి ఆగ్నేయంగా 980 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 1,030 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. నవంబర్ 3వ తేదీ తెల్లవారుజామున ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంగా చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. సముద్రం అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేయనున్నారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఏపీ స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధం

ఒకటి తరువాయి

విజయవాడ లో ఎన్నికల కమిషనర్ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి జిల్లాలో జనరల్, వ్యయ పరిశీలకులతో పాటు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఏకగ్రీవాలు పోనూ మిగిలిన 13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీల్లోని మొత్తం - 3,186 వార్డులకు రేపు (ఆదివారం) పోలింగ్ జరగనుందని వివరించారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 11,378 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 51,716 మంది సిబ్బందిని విధుల్లో నియమించామని చెప్పుకొచ్చారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కవరేజ్, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరిచే గడువును 30 రోజుల నుంచి 60 రోజులకు పెంచామని తెలిపారు. ఎలక్షన్ పిటిషన్లు పరిష్కారమయ్యే వరకు వీటిని స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరుస్తామని ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ కోసం ఏపీవ్యాప్తంగా పటిష్ఠ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఐజీ రాజకుమారి తెలిపారు. ఎన్నికల విధుల్లో మొత్తం 36,351 మంది పోలీసు బలగాలు విధుల్లో ఉన్నాయని వెల్లడించారు. సమస్యాత్మక, హింసాత్మక ప్రాంతాల్లో 130 ప్లాటూన్ల ఏపీ స్పెషల్ పోలీసు బలగాల ఏర్పాటు చేసినట్లు చెప్పుకొచ్చారు. హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో 1+4, 1ం3 స్కేల్‌తో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్ విధుల్లో ఉన్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీలు, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6,600 పోలింగ్ కేంద్రాల్లో దాదాపు 12,000 సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేసినట్లు ఐజీ రాజకుమారి వివరించారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు, రూట్ క్లియరెన్స్ కోసం 1,543 రూట్ మొబైల్ వాహనాల వినియోగిస్తున్నట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్పీ, సీనియర్ అధికారుల పర్యవేక్షణలో క్విక్ రియాక్షన్ టీమ్స్ (ఉ=) ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎన్నికల కోడ్ (వీజజ) ఉల్లంఘనలను అడ్డుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం డేటాను అధికారులు వెల్లడిస్తారని ఐజీ రాజకుమారి పేర్కొన్నారు.

అమెరికా ఎన్నికలపై ట్రంప్ ఉక్కుపాదం!

ఒకటి తరువాయి

మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. న్యాయశాఖ సివిల్ కేసుతో పాటు క్రిమినల్ దర్యాప్తును కూడా వేగవంతం చేసింది. 40కి పైగా సబ్‌పోనాలు జారీ చేయడంతో పాటు, అనుమానాస్పదంగా భావిస్తున్న బ్యాలెట్లను ప్రత్యేకంగా భద్రపరచాలని కోర్టును కోరింది. మరోవైపు అలాస్కా రాష్ట్ర ఎన్నికల అధికారులు ఈ చర్యలను ప్రశ్నిస్తున్నారు. బ్యాలెట్లను వేరుచేయడం ఓటు రహస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని వాదిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ఎన్నికల ఫలితాలను రాష్ట్రం ధ్రువీకరించకుండా అడ్డుకోవాలన్న న్యాయశాఖ ప్రయత్నం మరింత వివాదాస్పదమవుతోంది. అమెరికా కాంగ్రెస్‌లో రెండు సభలు ఉంటాయి. ఒకటి ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్), మరొకటి సెనేట్. ప్రస్తుతం సెనేట్‌లో రిపబ్లికన్లకు 53, డెమోక్రాట్లకు 47 స్థానాల బలం ఉంది. ఈ ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడం ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా ఎంతో ముఖ్యం. మరోవైపు డెమోక్రాట్లు కనీసం నాలుగు స్థానాలను అదనంగా గెలుచుకుంటే సెనేట్‌లో ఆధిక్యాన్ని సాధించే అవకాశం ఉంటుంది. నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో సెనేట్‌లోని 35 స్థానాలతో పాటు ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఫలితాలు ట్రంప్ అధ్యక్ష పదవీకాలంలోని మిగిలిన రెండేళ్ల రాజకీయ దిశను ప్రభావితం చేయనున్నాయి. సెనేట్‌పై పట్టు కోల్పోతే ట్రంప్ ప్రభుత్వానికి చట్టాల ఆమోదం, కీలక నియామకాలు, ప్రభుత్వ విధానాల అమలు వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అదే సమయంలో డెమోక్రాట్లు సభల్లో ఆధిక్యం సాధిస్తే ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు, వివాదాస్పద చర్యలపై కాంగ్రెస్ కమిటీల ద్వారా విచారణలు చేపట్టే అవకాశం ఉంది. అందుకే ఈ ఎన్నికలను ఇరు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో అలాస్కా పోరు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశవ్యాప్తంగా సెనేట్ ఆధిపత్యాన్ని నిర్ణయించగల పోటీల్లో ఇది ఒకటిగా పరిగణిస్తున్నారు. ఇక్కడి ఫలితం దగ్గరదగ్గరగా ఉంటే, ఓట్ల లెక్కింపు లేదా ధ్రువీకరణపై న్యాయపోరాటం సెనేట్‌లో ఆధిపత్యం ఎవరిదన్న ప్రశ్నను మరింత కాలం అనిశ్చితిలో ఉంచవచ్చు. అలాస్కా సెనేట్ ఎన్నికల్లో ప్రధానంగా ముగ్గురు పేర్లు చర్చకు వచ్చాయి. రిపబ్లికన్ పార్టీ తరఫున ప్రస్తుత సెనేటర్ డాన్ ఎస్. సుల్లివన్, డెమోక్రటిక్ పార్టీ తరఫున మాజీ ప్రతినిధుల సభ సభ్యురాలు మేరీ పెల్టోలా పోటీ చేస్తున్నారు. వీరితో పాటు డేనియల్ జె. సుల్లివన్ జూనియర్ అనే స్వతంత్ర అభ్యర్థి కూడా బరిలో ఉన్నారు. మరో అభ్యర్థి జెరాల్డ్ హైక్స్ కూడా పోటీలో ఉన్నారు. ఇక్కడే అసలు వివాదం మొదలైంది. రిపబ్లికన్ అభ్యర్థి పేరు డాన్ సుల్లివన్ కాగా, మరో అభ్యర్థి పేరు కూడా డేనియల్ సుల్లివన్. పేర్లలో పోలిక ఉండటంతో ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది. రిపబ్లికన్ అభ్యర్థికి వేయాలనుకున్న ఓటు పొరపాటున మరో సుల్లివన్‌కు పడేలా వ్యూహం రచించారన్నది ఆరోపణ. అయితే ఈ ఆరోపణలను మేరీ పెల్టోలా ఖండించారు. తనకు అలాంటి ప్రయత్నాల గురించి తెలియదని స్పష్టం చేశారు. డెమోక్రటిక్ సెనేటోరియల్ క్యాంపెయిన్ కమిటీ కూడా తమకు సంబంధం లేదని తెలిపింది. డేనియల్ సుల్లివన్ జూనియర్ సైతం పెల్టోలా ప్రచార బృందంతో సమన్వయం చేసుకున్నట్లు వచ్చిన ఆరోపణలను ఖండించారు. న్యూయార్క్ టైమ్స్ కథనంలోని వివరాలను రాయిటర్స్ కూడా స్వతంత్రంగా ధ్రువీకరించలేదని స్పష్టం చేసింది. అందువల్ల ప్రస్తుతం ఈ వ్యవహారంలో ఆరోపణలు, ఖండనలు మాత్రమే ఉన్నాయి. ఏదైనా నేరం జరిగిందని తేల్చే న్యాయస్థాన తీర్పు ఇంకా వెలువడలేదు. ఈ ఆరోపణల నేపథ్యంలో అమెరికా న్యాయశాఖ దర్యాప్తును వేగవంతం చేసింది. అక్టోబర్ 29 నాటికి 40కి పైగా సబ్‌పోనాలు, పత్రాలను భద్రపరచాలన్న నోటీసులు జారీ చేసినట్లు పలు మీడియాలు కథనం. వీటిని మేరీ పెల్టోలా ప్రచార బృందం, డేనియల్ సుల్లివన్ జూనియర్ ప్రచార బృందాలకు కూడా పంపినట్లు సమాచారం. సబ్‌పోనా అంటే విచారణలో భాగంగా అవసరమైన పత్రాలు, సమాచారం లేదా సాక్ష్యాలను సమర్పించాలని సంబంధిత వ్యక్తులు, సంస్థలకు న్యాయపరంగా జారీ చేసే ఆదేశం. దీన్ని జారీ చేయడం వల్ల సంబంధిత వ్యక్తి నేరం చేసినట్లు నిర్ధారణ అయినట్లు కాదు. విచారణకు అవసరమైన ఆధారాలను సేకరించడమే దీని ఉద్దేశం. అలాస్కా ఫెడరల్ ప్రాసిక్యూటర్ మైఖేల్ హేమన్ అక్టోబర్ 30న మీడియాతో మాట్లాడుతూ.. ఈ దర్యాప్తు గత కొన్ని నెలలుగా కొనసాగుతోందని వెల్లడించారు. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రచురితమైన తర్వాత ఎఫ్‌బీఐ సిబ్బంది, దర్యాప్తు వనరులను గణనీయంగా పెంచినట్లు చెప్పారు. పలువురు ప్రాసిక్యూటర్లను కూడా ఈ కేసుకు కేటాయించినట్లు తెలిపారు. దర్యాప్తు వేగంగా, తీవ్రంగా కొనసాగుతోందని పేర్కొన్న ఆయన.. ఎన్నికల ప్రక్రియను అక్రమంగా ప్రభావితం చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అయితే ఏయే చట్టాల కింద నేరాలను పరిశీలిస్తున్నారో, ఎవరిని లక్ష్యంగా చేసుకుని విచారణ జరుగుతోందో మాత్రం వెల్లడించలేదు. ఈ కేసులో మరో కీలక అంశం ట్రంప్ స్వయంగా చేసిన వ్యాఖ్యలు. అలాస్కా ఎన్నికల ఫలితాల ధ్రువీకరణను అడ్డుకునేలా న్యాయశాఖ దావా వేయడంలో తన పాత్ర ఉందని ఆయన గతంలో వెల్లడించారు. 'దీన్ని చేయాలని చెప్పింది నేనే' అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మేరీ పెల్టోలా, డేనియల్ సుల్లివన్ జూనియర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూడా బహిరంగంగా కోరారు. ఫ్లోరిడాలో జరిగిన ప్రచార సభలోనూ ఈ వ్యవహారాన్ని అత్యున్నత స్థాయిలో జరిగిన ఓటర్ల మోసంగా అభివర్ణించారు. అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ కూడా సభలో ఉండగా, ఈ కేసుపై తన నిర్ణయం తానే తీసుకోవాలని ఆయనను ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించడం చర్చకు దారితీసింది. ఇక్కడే కీలకమైన రాజ్యాంగపరమైన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అధ్యక్షుడికి ప్రభుత్వ న్యాయశాఖపై విధానపరమైన అధికారాలు ఉన్నప్పటికీ, క్రిమినల్ దర్యాప్తులు ఆధారాలు, చట్టాలు, న్యాయపరమైన ప్రక్రియల ఆధారంగా సాగాలి. ఒక నిర్దిష్ట అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని అధ్యక్షుడు బహిరంగంగా కోరుతున్న సమయంలో దర్యాప్తు స్వతంత్రతపై ప్రశ్నలు తలెత్తడం సహజం. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఫెడరల్ ప్రాసిక్యూటర్ బహిరంగంగా క్రిమినల్ దర్యాప్తును ధ్రువీకరించడం అసాధారణ పరిణామంగా అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది. ఎన్నికల సమయంలో రాజకీయ ఫలితాలను ప్రభావితం చేస్తున్నట్లు కనిపించే చర్యలకు దూరంగా ఉండాలన్నది అమెరికా న్యాయశాఖలో దీర్ఘకాలంగా అనుసరిస్తున్న సంప్రదాయం. ఈ నేపథ్యంలో దర్యాప్తు వేగం, దాని సమయం, ప్రభుత్వ పెద్దల వ్యాఖ్యలు అన్నీ పరిశీలనకు వస్తున్నాయి. అక్టోబర్ 30న న్యాయశాఖ మరో కీలక అభ్యర్థనతో కోర్టును ఆశ్రయించింది. డేనియల్ జె. సుల్లివన్ జూనియర్‌కు ఓటు వేసినట్లు గుర్తించగల బ్యాలెట్ పత్రాలను ప్రత్యేకంగా భద్రపరచాలని కోరింది. ఓటర్లలో పేర్ల కారణంగా గందరగోళం ఏర్పడిందా? రిపబ్లికన్ సెనేటర్‌కు వేయాల్సిన ఓట్లు పొరపాటున మరో అభ్యర్థికి పడ్డాయా? అనే విషయాలను పరిశీలించేందుకు ఈ చర్య అవసరమని పేర్కొంది. అయితే అలాస్కా ఎన్నికల అధికారులు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికల రోజున బ్యాలెట్ పత్రాలన్నీ ఒకే పెట్టెలో కలిసిపోతాయని, వాటిని తిరిగి వేరుచేయడం సాధ్యం కాదని రాష్ట్రం వాదిస్తోంది. అలా చేయడం ఓటు రహస్యాన్ని ఉల్లంఘించే ప్రమాదం ఉందని తెలిపింది. అంతేకాదు, బ్యాలెట్ పత్రంలో ఇద్దరు అభ్యర్థుల పేర్లను స్పష్టంగా వేర్వేరుగా పేర్కొన్నామని రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత సెనేటర్‌ను 'డాన్ ఎస్. సుల్లివన్, రిపబ్లికన్, ప్రస్తుత సెనేటర్'గా, మరో అభ్యర్థిని 'డేనియల్ జె. సుల్లివన్ జూనియర్, స్వతంత్ర అభ్యర్థి'గా గుర్తించామని వివరిస్తున్నారు. అలాస్కాలో అమలులో ఉన్న ర్యాంక్డ్ ఛాయిస్ ఓటింగ్ విధానం కూడా ఈ వివాదంలో కీలకంగా మారింది.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA,
ARUNODAYA OFFSET PRINTERS“#33-5-9, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA“PH: 0866-2431422, 9346504777
“E-MAIL: ARUNODAYAVJW@GMAIL.COM . EDITOR DONDLAVAGU BHAVYA. 08562-461571 APTEL/2026/A2902